

ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 11: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదట విడత 129 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు ఉదయం 6,823 మంది హాజరవగా 169 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 5,111 మంది పరీక్షలురాయగా, 68 మంది విద్యార్థులు హాజరుకాలేదు. పరీక్షలు రాసిన వెంటనే ఇన్విజిలేటర్లు జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించిన పరీక్షలను ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్‌లో జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పరిశీలించారు.

పశ్చిమలో ఓట్ల తొలగింపునకు కుట్ర

ఒకటికి మించి ఫారం-7 దాఖలు చేసిన 163 మంది

4,875 ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు

తప్పుడు ఫారాలు ఇచ్చిన అధికార పార్టీ నేతలు



- ఓట్ల తొలగింపునకు అధికారుల చర్యలు
- ఎమ్మెల్యే గణబాబు ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం
- దర్యాప్తు వేదిక సమర్పించినా చర్యలకు వెనుకడుగు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):
ఓటరు జాబితాలో అనేక రకాల ప్రహసనాలు బయటపడుతున్నాయి. ఇప్పటికే డబుల్ ఎంట్రీలు, మృతుల ఓట్లతో జాబితాలు లోపభూయిష్టంగా రూపొందించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు అధికార పార్టీ నేతలకు అనుకూలంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోందనే వాదనా వినిపిస్తోంది. ఈ క్రమంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో భారీ సంఖ్యలో ఓట్ల తొలగింపునకు జరిగిన కుట్ర బయటపడింది. నియోజకవర్గంలో అధికారపార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఒకటి కంటే ఎక్కువగా ఫారం-7 దరఖాస్తులు సమర్పించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై సమాచారం అందుకున్న ఎమ్మెల్యే గణబాబు లోతుగా వివరాలు సేకరించి గత నెలలోనే అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు పశ్చిమ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్ చేపట్టిన విచారణ నివేదిక మేరకు బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం అనేక అనుమానాలకు దారితీస్తోంది.

గత ఏడాది అక్టోబరు 27న విడుదలచేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో కొన్ని ఓట్లు తొలగించాలని అధికారపార్టీ నేతల సూచనలతో కిందిస్థాయి నాయకులు రంగంలోకి దిగా రు. బోగస్ ఓటర్లు ఉన్నారని పేర్కొంటూ ఒక్కొక్కరు ఒకటి కంటే ఎక్కువగా ఫారం-7 దాఖలుచేసి ఆయా ఓట్లను జాబితా నుంచి తొలగించాలని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఒక వ్యక్తి ఐదుకు మించి ఫారం- 7 దరఖాస్తులు చేయకూడదు. కానీ 163 మంది ఒక్కొక్కరు పది, అంతకంటే ఎక్కువగా మొత్తం 4,875 ఓట్లు తొలగించాలని దరఖాస్తుచేశారు. వీటిని పరిశీలించిన బూత్‌లెవెల్ అధికారులు 1,126 ఫారాలను తిరస్కరించారు. అయితే అర్హు లైన ఓటర్లను తొలగిస్తున్నారన్న సమాచారం మేరకు ఎమ్మెల్యే గణబాబు అప్రమత్తమై క్షేత్రస్థాయిలో సమాచారం తెలుసుకునే ... మిగతా 6వ పేజీలో

ఇవీ ఫారం 7 అక్రమాలు

విశాఖ పశ్చిమలో బూత్ నంబరు 204కు చెందిన నూకరాజు అనే వ్యక్తి పక్కనున్న బూత్‌నంబరు 203లో ఉంటున్న 144 మంది ఓట్లు తొలగించాలని ఫారం-7 దాఖలు చేశారు. దీంట్లో 40 దరఖాస్తులను బీఎల్‌వోలు తిరస్కరించారు. ఇదే బూత్‌కు చెందిన పెంటారావు బూత్ నంబరు 89లో 122 ఓట్లను తొలగించాలని దరఖాస్తు చేశారు. బూత్ నంబరు 53లో కె.రవి తనకు సంబంధంలేని బూత్ నంబరు రెండు నుంచి 215 వరకు మొత్తం 28 బూత్‌లలో ఉన్న 106మంది ఓట్లు తొలగింపునకు దరఖాస్తు చేస్తే 76 దరఖాస్తులను బీఎల్వోలు తిరస్కరించారు. బూత్ నంబరు 105లో ఉంటున్న సన్యాసిరావు 103,105 బూత్‌లలో 106 ఓట్లు, బూత్ నంబరు 93కు చెందిన మోహబూబ్ 98, 105, 106 బూత్‌లలో 86 ఓట్లు, బూత్ నంబరు 180లో ఉన్న సత్యవతి సుమారు 20 బూత్‌లలో ఉన్న 72 మంది ఓట్లు తొలగించాలని దరఖాస్తు చేశారు. ఈ విధంగా 70 మంది వరకు 25 కంటే ఎక్కువగా, మిగిలిన వారంతా పదికంటే ఎక్కువగా ఫారం-7 దాఖలు చేశారు.

దర్యాప్తుపై ఒత్తిళ్లు!

తహసీల్దార్ హత్య కేసును నీరుకార్చే యత్నాలు



తహసీల్దార్ రమణయ్య (ఫైల్ ఫొటో)

- కస్టడీలో నిందితుడు గంగారావు వెల్లడించిన అంశాలపైనా గోప్యత
- తెరవెనుక సూత్రధారులు తప్పించుకున్నట్టేనని ప్రచారం
- పోలీసుల తీరుపై రెవెన్యూ ఉద్యోగుల్లో అనుమానం!



నిందితుడు గంగారావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన తహసీల్దార్ రమణయ్య హత్య కేసు దర్యాప్తుపై పోలీసులకు ఉన్నతస్థాయి నుంచి ఒత్తిళ్లు పెరిగినట్టు ప్రచారం జరుగుతోంది. విశాఖపట్నం రూరల్ తహసీల్దార్‌గా పనిచేసిన సనపల రమణయ్యకు విజయనగరం జిల్లా బొండపల్లి బదిలీ కావడం, అక్కడ బాధ్యతలు స్వీకరించి ఇంటికి చేరుకున్న అతడ్ని రాత్రి పది గంటల సమయంలో మురారీ సుబ్రహ్మణ్యం గంగారావు ఇనుపరాడ్‌తో తలపై మోది హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగిన మరుసటిరోజే నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించగా, వారి అభ్యర్థన మేరకు కోర్టు కస్టడీకి అనుమతించింది.

పోలీసులు గంగారావును పట్టుకున్న ఒకరోజు వ్యవధిలోనే అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపడంతో వివరాలను రాబట్టడానికి అవకాశం లేదనుకున్నా.. తర్వాత నాలుగు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. ఇప్పటికే మూడు రోజులు గడిచిపోయాయి. డీసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఏసీపీ, సీఐ మరికొంతమంది సిబ్బంది గంగారావును విచారిస్తున్నారు. సీపీ రవిశంకర్ అయ్యనార్ కూడా శనివారం పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విచారణ జరుగుతున్న తీరును పరిశీలించారు. అయితే ఇంతవరకూ పోలీసులు సేకరించిన సమాచారం బయటకు చెప్పకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతేకాకుండా విచారణలో వెల్లడించిన అంశాలేవీ బయటకు తెలియడానికి వీల్లేదని, ఒకవేళ లీక్ అయితే బాధ్యులపై తీవ్ర చర్యలు ఉంటాయని ఉన్నతాధికారులు హెచ్చరించడంతో సిబ్బంది విచారణ జరుగుతున్న గదివైపు వెళ్లడానికి కూడా భయపడిపోతున్నారని సమాచారం.

తెరవెనుక సూత్రధారులెవరు?

పెదరుషికొండలోని సర్వేనంబరు 380/1లోని కొంతభాగంలో నిర్మించిన అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన స్థలానికి కన్వేయెన్స్‌డీడ్ జారీ విషయమే హత్యకు దారితీసిందని పోలీసులు ప్రకటించారు. గంగారావు ఒక రియల్‌ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ వెల్లడించారు. దీనిని బట్టి గంగారావుకు వ్యక్తిగతంగా తహసీల్దార్‌తో ఎలాంటి లావాదేవీలు నిర్వహించాల్సిన అవసరం లేదని ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. అయితే గంగారావు ఎవరి కోసం కన్వేయెన్స్‌డీడ్ ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి రెవెన్యూ ఉద్యోగుల పెన్‌డౌన్

- తహసీల్దారు హత్యపై ప్రభుత్వ స్పందన శూన్యమని ఆవేదన



నినాదాలు చేస్తున్న రెవెన్యూ సంఘ ప్రతినిధులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ రూరల్ తహసీల్దారు ఎస్.రమణయ్య హత్య జరిగి పదిరోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంపై రెవెన్యూ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆదివారం విశాలాక్షినగర్‌లో నిర్వహించిన రెవెన్యూ హౌస్ బిల్డింగ్ సొసైటీ సాధారణ సమావేశంలో రమణయ్య హత్యపై సభ్యులు చర్చించారు. తహసీల్దారు హత్యకు గురైన తరువాత రెవెన్యూ ఉద్యోగులు ధైర్యంగా విధులు నిర్వహించలేకపోతున్నారని, ప్రభుత్వ ఆస్తులు కాపాడేందుకు వెనుకాడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రమణయ్య హత్యను ఖండిస్తూ, ఆయన కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాతోపాటు అతని సతీమణికి గ్రూప్-2 ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రమణయ్య హత్యపై ప్రభుత్వం స్పందించే వరకు సహాయ నిరాకరణ చేస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి పెన్‌డౌన్ చేసేందుకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. రెవెన్యూ ఉద్యోగుల సొసైటీ అధ్యక్షుడు కృష్ణకిశోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి విశాఖ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథరావు, కలెక్టరేట్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బెహరా రవిశంకర్, ఎన్జీవో సంఘం నగర కార్యదర్శి సత్యనారాయణ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, రిటైర్డు రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎం.మధుసూదనరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సిలబస్ పేరుతో చుక్కలు

టెట్, డీఎస్సీ అభ్యర్థులకు ముప్పు తిప్పలు

గతంలో లేని విధంగా అధికారుల నిర్ణయం

ఆందోళనలో ఆశావహ అభ్యర్థులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):
టెట్, డీఎస్సీ ఆశావహ అభ్యర్థులను సిలబస్ ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సిలబస్ ఇచ్చా రని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ కోసం పోరాటం చేసిన నిరుద్యోగులపై కక్ష సాధింపులో భాగంగానే సిలబస్‌ను అధికంగా ఉండేలా చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సాధారణంగా టెట్, డీఎస్సీ అర్హత పరీక్షలో కంటెంట్, మెథడాలజీ సిలబస్‌గా ఉంటాయి. టెట్ రాసే అభ్యర్థులు మూడు నుంచి పది (డీఎడ్ అభ్యర్థులు), ఆరు నుంచి ఇంట ర్ వరకు (బీఈడీ అభ్యర్థులు) సిలబస్‌ను రిఫర్ చేస్తారు. ఇవి ఎప్పుడు నిర్వహించినా అంతకుముందు అకడమిక్ ఇయర్‌లో అమలుచేసిన సిలబస్ ఇవ్వాలి. దీనిప్రకారం తాజాగా నిర్వహించనున్న టెట్, డీఎస్సీలో 2022-23 విద్యా సంవత్సరంలో అమలుచేసిన సిలబస్ ఇవ్వాలి. కానీ ఇక్కడే విద్యాశాఖ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తోంది.

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా రంగంలో సంస్కరణల పేరుతో 2019 నుంచి 2023 వరకు ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు సిలబస్‌ను మార్చేసింది. 2023-24లో కూడా ఆరు, ఏడు, ఎనిమిది తరగ తుల సిలబస్‌ను మార్చింది. 2018లో అప్పటి ప్రభుత్వం కొన్ని తరగతుల సిలబస్ మార్చింది. ఇప్పటి వరకు మార్చిన మొత్తం సిలబస్ లోనే టెట్, డీఎస్సీలో ప్రశ్నలు ఇవ్వనున్నారు. అయితే కేవలం తొమ్మిదోతరగతి సిలబస్‌ను రిఫర్ చేయ డానికే కనీసం రెండు నెలలు పడుతుంది. అలాంటిది ఇన్నేళ్ల పాటు మార్చిన సిలబస్‌ను నెల రోజుల వ్యవధిలోనే పూర్తి చేయడం సాధ్యం కాదని అభ్యర్థులు వాపోతున్నారు.

14 మెథడ్స్ చదవాల్సిందే...

ఎస్జీటీ అభ్యర్థులకు 2018 వరకు ఐదు మెథడ్స్ ఉండేవి. ఆ తరువాత ప్రభుత్వం దీనిని తొమ్మిదిగా మార్పు చేసింది. తాజాగా టెట్, డీఎస్సీలో వీటితో పాటు పాత ఐదు మెథడ్స్‌ను సిలబస్‌లో ఇస్తున్నట్టు విద్యాశాఖ వెల్లడించింది. ఒక్కో మెథడాలజీ పుస్తకం 300 పేజీలుంటుంది. తొమ్మిది మెథడా లజీలు తిరగేసేందుకు రెండు నెలలు పడుతుందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. వీటితోపాటు ... మిగతా 6వ పేజీలో

ఆడుదాం ఆంధ్రపై ఆటగాళ్ల అసహనం



గాయపడిన క్రీడాకారిణికి సపర్యలు



అనకాపల్లి-అన్నమయ్య జిల్లాల మధ్య కబడ్డీ పోటీలో గాయపడిన క్రీడాకారుడు

- మైదానం గట్టిగా ఉండడంతో గాయాలు
- భోజనం తినలేకపోయిన క్రీడాకారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆడుదాం ఆంధ్ర రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మూడు రోజులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో జరుగుతున్నాయి. పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో ఆటగాళ్లకు మ్యాచులు నిర్వహించారు. మైదానంలో నేల గట్టిగా (హార్డ్)గా ఉండడంతో పలువురు క్రీడాకారులకు గాయాలయ్యాయి. మైదానాన్ని సరిగా సిద్ధం చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. నేల చాలా గట్టిగా ఉండడంతో పలువురు చేతులు, కాళ్లకు గాయాలవడంతో వైద్య సిబ్బంది చికిత్స అందించారు.

ఇదిలా ఉండగా ఆదివారం మధ్యాహ్నం ఆటగాళ్లకు అందించిన బిర్యానీ బాగా లేకపోవడంతో పలువురు డస్ట్‌బిన్‌లో పడేశారు. చాలామంది క్రీడాకారులు పెరుగన్నంతోనే సరిపెట్టుకున్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న పోటీలకు అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేకపోయారని క్రీడాకారులు వాపోయారు. భోజనం కూడా సరిగా లేకపోతే ఎలా ఆడతామని అసహనం వ్యక్తం చేశారు.

నగరానికి సీఎం జగన్ రాక రేపు

ఆడుదాం ఆంధ్ర ముగింపు వేడుకకు హాజరు



విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖపట్నం రానున్నారు. పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరిగే 'ఆడుదాం ఆంధ్ర' ముగింపోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. మంగళవారం సాయంత్రం 5.20 గంటలకు సీఎం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 5.45 గంటలకు ఐటీహిల్-3పై ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో ఆరు గంటలకు పీఎంపాలెం క్రికెట్ స్టేడియంకు వస్తారు. స్టేడియంలో ప్రజలకు అభివాదం చేసిన అనంతరం క్రికెట్ ఫైనల్ మ్యాచ్ చివరి ఐదు ఓవర్లను తిలకిస్తారు. మ్యాచ్ ముగిసిన తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రోన్ షో, లైట్ షో వీక్షిస్తారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడి, విజేతలకు బహుమతులు అందజేస్తారు. ఆ తరువాత రోడ్డుమార్గంలో రాత్రి 8.05 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, ప్రత్యేక విమానంలో బయలుదేరి విజయవాడ వెళ్తారు.

సత్రం భూములు అన్యాక్రాంతం!

దాతల ఆశయానికి నిలువునా గండి

ఇప్పటికీ చేతులు మారుతున్న వైనం

భీమునిపట్నం (రూరల్) ఫిబ్రవరి 11:
ప్రజా ప్రయోజనం కోసం దాతలు వితరణగా ఇచ్చిన భూములు అన్యాక్రాంతమైపోతున్నాయి. దేవదాయ శాఖ అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా నిలువరించడానికి వీలు లేని రీతిలో చేతులు మారుతున్నాయి. రోజురోజుకీ వీటి విలువ పెరుగుతుండడంతో అక్రమార్కుల చేతుల్లో నలిగిపోతున్నాయి. దాతల ఆశయానికి ఏనాడో గండిపడినా, కనీసం దేవదాయ శాఖకు ఆదాయం కూడా దక్కని పరిస్థితి ఎదురవుతోంది.

- దేవదాయశాఖకు తలనొప్పిగా మారిన వ్యవహారం
- ఏళ్లుగా కోర్టు గడప దాటని వివాదాలు
- పరిరక్షణపై పటిష్ట చర్యలు చేపట్టని అధికారులు
- భీమిలిలోని లంగర్‌ఖానా సత్రం భూముల వ్యవహారం

లంగర్‌ఖానా సత్రం భూములు





లంగర్‌ఖానా భూములకు హద్దులు వేస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

బాటసారుల సేద తీర్చడం, వారికి ఆశ్రయమివ్వడం, ఆహారాన్ని అందించేందుకు వీలుగా పూర్వం సత్రాలను ఏర్పాటు చేసేవారు. వసతులన్నీ ఉచితంగా అందించేందుకు వీటికి దాతలు భూములను కేటాయించి, వచ్చిన ఫలసాయాన్ని వినియోగించేలా చర్యలు తీసుకునేవారు. ఈ కోవలోనే భీమిలిలోని మునిసిపల్ కమిషనర్ క్వార్టర్ వెనుక భాగంలో లంగర్‌ఖానా పేరుతో 19వ శతాబ్దం తొలినాళ్లలో ఓ సత్రం వెలిసింది. ఒడిశా నుంచి వలస వచ్చిన కృష్ణరాజసాగర్ పండా దీనిని ఏర్పాటు చేసి, నిర్వహణ కోసం భీమిలి చుట్టుపక్కల భూములు కేటాయించారు. ఇవి ప్రభుత్వ రికార్డుల ప్రకారం సుమారు 119.54 ఎకరాలున్నాయి. ఈ భూములపై వచ్చే ఫలసాయంతో సత్రాన్ని నిర్వహించేవారు.

వందేళ్ల క్రితమే మూత...

సత్రానికి కావాల్సిన నిధుల సమీకరణకు వీలుగా భూములు అందుబాటు లో ఉన్నప్పటికీ, జనాదరణ ... మిగతా 6వ పేజీలో

అప్పుల బాధతో కుటుంబం ఆత్మహత్యాయత్నం

- యజమాని మృతి, కోలుకున్న భార్య, కుమార్తెలు
- పద్మనాభం మండలం ఏనుగులపాలెంలో ఘటన



చిన్నయ్య (ఫైల్ ఫొటో)

పద్మనాభం, ఫిబ్రవరి 11: అప్పుల బాధతో ఓ కుటుంబం ఆత్మహత్యా యత్నం చేసింది. ఈ ఘటనలో కుటుంబ యజమాని మృతిచెందగా, భార్య, ఇద్దరు కుమార్తెలు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ సంఘటన పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెం గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఏనుగులపాలెం గ్రామానికి చెందిన కొమ్మూరి చిన్నయ్య (49) లారీ డ్రైవరు. కొంతకాలం తరువాత ఫైనాన్స్‌పై సొంతంగా టాటా మేజిక్ వాహనం కొనుగోలు చేశాడు. అయితే మద్యానికి బానిస కావడం, పిల్లల చదువు, వాహనం కొనుగోలుకు అప్పులు చేశాడు. వాటిని సకాలంలో చెల్లించలేకపోవడంతో అప్పు ఇచ్చిన వారు ఇంటికి వస్తుండడంతో భార్య మంగతో పాటు ఇద్దరు కుమార్తెలు ఇబ్బంది పడేవారు. పెద్ద కుమార్తె అనుప్రియ బీఫార్మసీ, రెండో కుమార్తె మానస ఇంటర్ చదువుతోంది. అప్పుల కారణంగా మంగ మానసిక వేదనతో అనారోగ్యం పాలైంది. ఈ క్రమంలో ప్రతిరోజూ నిద్రమాత్రలు వేసుకునేది. ఎదిగిన కుమార్తెలు, వారి చదువులు, భర్త మద్యానికి బానిసకావడం, అప్పులవాళ్లు ఇంటిపైకి వస్తుండడంతో ఆమె శనివారం ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. భర్త మద్యం తాగి ఇంటికి వచ్చిన తరువాత సాయంత్రం ఆరు గంటల సమయంలో పాలలో నిద్రమాత్రలు కలిపి భర్తతో సహా అందరికీ ఇచ్చింది. అనంతరం ఆమె బావిలో దూకడానికి పరుగున వెళ్తుండగా గ్రామస్థులతో పాటు చిన్నయ్య సోదరుడు వెంకన్న చూసి, నిలువరించి ఇంటికి తీసుకువెళ్లాడు. అప్పటికే మిగిలిన వారంతా అపస్మారక స్థితిలో ఉండడంతో 108 వాహనానికి ఫోన్ చేశారు. సిబ్బంది పరిశీలించి చిన్నయ్య మృతి చెందినట్టు నిర్ధారించారు. మిగిలిన వారిని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొంది కోలుకోవడంతో ఆదివారం ఇంటికి తీసుకువచ్చారు. మృతుడి సోదరుడు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ శ్రీధర్ పర్యవేక్షణలో ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నయ్య మృతదేహానికి ఆదివారం భీమిలిలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఘంటసాల గీతాలాపన



గాయకుడు చిట్టిబాబును సత్కరిస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11 : దివంగత సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 49వ వర్థంతి కార్యక్రమాన్ని రైల్వేన్యూకాలని ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆలయ వ్యవస్థాపకుడు నూకల శేషగిరిరావు, గాయకుడు గల్లాచిట్టిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఘంటసాల భక్తి గీతాలను గల్లా చిట్టిబాబు ఆలపించారు.అనంతరంఆయనకు ఘనంగా సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు పరీక్ష చేస్తున్న డాక్టర్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11: గ్రేటర్ 44వ వార్డు నందగిరినగర్‌లో ఆదివారం శ్రీ నందగిరినగర్ సేవా సంఘం, లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానికులకు వైద్య సిబ్బంది వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండీ కాండ్రుగుల వెంకట రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా వివిధ ప్రాంతాల్లో పేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అప్సా' రాష్ట్ర ఉపాధ్యక్షునిగా శ్రీనివాసరావు నియామకం

కంచరపాలెం, ఫిబ్రవరి 11 : ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నగరానికి చెందిన బి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆదివారం తిరుపతిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనకు నియామక పత్రాన్ని సంఘం ప్రతినిధులు అందజేశారు. కాగా, శ్రీనివాసరావు కంచరపాలెంలో న్యూటన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్‌గా ఉన్నారు. ప్రైవేట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావును అభినందించారు.

రాష్ట్ర కార్యదర్శిగా చీకటి రమేశ్...

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా చీకటి రమేష్ ఎంపికయ్యారు. ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సంఘ సమావేశంలో విశాఖకు చెందిన జనసేన నేత చీకటి రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు.

వైభవంగా శ్రీనివాస కల్యోణోత్సవం

సీతమ్మధార, ఫిబ్రవరి 11 :స్థానిక టీపీటీ కాలనీ ద్రావిడ సంక్షేమ సంఘం కల్యాణమండపంలో శృతిలయ ఆధ్యాత్మిక భక్తి సంకీర్తన సేవా సంస్థ వ్యవస్థాపకుడు

వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం శ్రీనివాస కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శృతిలయ బృంద గాయకులు కల్యాణోత్సవంలో మధుర ఘట్టాలకు సన్నివేశాలకు అనుగుణంగా అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించారు. గురువు కేపీ రాజు, ఆచార్య జీఎస్ఎన్ రాజు, వంకాయల సన్యాసిరాజు, డాక్టర్ ఎన్ఏఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11: నిర్వహణ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. బీఎస్ లే అవుట్, నరసింహనగర్, పద్మశ్రీ హాస్పిటల్ ఏరియా, ఎన్‌జీజీఓస్ కాలనీ, జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఏరియా, చిన్నూరు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో వలంటీర్లకు చుక్కెదురు

» చేయూత పథకం కోతపై నిలదీత

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 11: జీవీఎంసీ 30 వార్డులో ఆదివారం ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో వలంటీర్లకు చుక్కెదురైంది. ప్రభుత్వం రూ. 25లక్షలకు వైద్యసాయం పెంచి అప్‌గ్రేడ్ చేసిన కొత్త కార్డులను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తున్న వలంటీర్లకు ఇతర సంక్షేమ పథకాలు కోత విధింపులపై మహిళలు నిలదీశారు. వైఎస్ఆర్ చేయూత పథకంలో తమను అనర్హులుగా చేశారంటూ వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా అర్హత కలిగిన తమకు అధిక కరెంట్ వినియోగం పేరిట పథకం నుంచి తప్పించడంపై కుమ్మరవీధి, జెండాచెట్టు, శాలిపేట, ఏనుగుల వీధి, చెంగలరావుపేట ప్రాంతాల్లోని మహిళలు నిలదీశారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ కార్డులున్నాయని, మళ్లీ కొత్తగా ఎందుకు అంటూ నిలదీశారు. దీంతో వలంటీర్లు రూ. 25లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలందుతాయంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పేరుతో ఉన్న కార్డుల స్థానంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులుగా జగన్ బొమ్మతో పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎన్నికల దృష్ట్యా మరోమారు కార్డుల పంపిణీ పేరుతో ఓటర్లకు వలవేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నట్టు ప్రజలు బహిరంగ విమర్శలకు దిగారు.

ఘనంగా కోస్టుగార్డు రైజింగ్ డే



సముద్రంలో నౌక, హెలికాప్టర్‌ల ప్రదర్శన

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కోస్టుగార్డు 46వ రైజింగ్ డే వేడుకలు ఆదివారం మల్కాపురంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డేఎటీసీ నిర్వహించి కోస్టుగార్డుకు చెందిన నౌకలు, విమానాల ప్రదర్శన చేపట్టారు. సముద్రంలో కోస్టుగార్డు నిర్వహించే కార్యకలాపాలకు సంబంధించి పలు అంశాలను డే ఎటీసీలో ప్రదర్శించారు.



చీకటి అలుముకున్న సింహపురి కాలనీ



ట్రాన్స్‌ఫార్మర్‌కు పొదలు అల్లుకుంటున్న దృశ్యం

అంధకారంలో కొండవాలు ప్రాంతాలు

» వీధిదీపాలు లేని వైనం.. రాత్రివేళల్లో రాకపోకలకు అవస్థలు

» పాములు, విషకీటకాల సంచారంతో స్థానికుల్లో భయం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11: గ్రేటర్ 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో వీధి లైట్లు లేక అంధకారం రాజ్యమేలుతోంది. రాత్రివేళల్లో ఆ ప్రాంత వాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కొండవాలు ప్రాంతాలు కావడంతో పాములు, విష కీటకాలు సంచరించే అవకాశం ఉండడంతో మరింత భయాందోళనకు గురవుతున్నారు.ఏడాది క్రితం వీధుల్లో 13 విద్యుత్ స్తంభాలు వేశారు. అనంతరం నాలుగు నెలల తర్వాత కేవలం 10 చోట్ల వీధిలైట్లు మాత్రమే వేసి మిగిలినవి అలాగే వదిలేశారు. వార్డులో వీధిదీపాల సమస్యపై స్థానికులు పలుమార్లు విద్యుత్‌శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదు. సింహగిరికాలనీలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పలుమార్లు కోరినా లైట్లు లేవని విద్యుత్ శాఖ సిబ్బంది సమాధానమిస్తున్నట్లు మండిపడుతున్నారు. కాలనీలోకి వెళ్లే ప్రధానదారి లోనూ వీధి దీపాలు లేవు. అయినా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చీకటయితే తాము వీధుల్లో తిరగడానికి భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్ల నుంచి హైమాస్ట్ లైట్ వేయాలని విన్నవించుకుంటున్నా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్ నేరుగా విద్యుత్‌శాఖాధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కార్పొరేటర్ మాటే లెక్క చేయడంలేదు..



సింహగిరి కాలనీలో రెండేళ్ల క్రితం కొత్తగా లైటు వేయాలని కోరినా, విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోలేదు. కార్పొరేటర్ కంపా హనోక్ సుమారు 20 సార్లు విద్యుత్ శాఖకు ఈసమస్య విన్నవించారు. అయినా ఆయన మాట కూడా లెక్క చేయలేదు. చీకటిపడితే పాములు, విషకీటకాలు సంచరిస్తుంటాయి. ఇకనైనా ఉన్నతాధికారులు వీధి లైట్లు వేసేలా చర్యలు తీసుకోవాలి.

-కె. నాయుడు, సింహగిరికాలనీ, 45వ వార్డు

కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



అలంకరణలో కన్యకాపరమేశ్వరి

మహరాణిపేట ఫిబ్రవరి 10: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. 1014 ఏళ్ల కింద వైశ్య జాతిని జాగృతి పరచి తనతోపాటు 102 మంది ఆర్యవైశ్య దంపతులను అగ్ని గుండంలోకి నడిపించి శివైక్యం పొందిన రోజైన మాఘ మాసం విదియ నాడు వైశ్యులు ఏటా వాసవీ మాత ఆత్మర్పణ దినోత్స వం నిర్వ హిస్తారు. ఈసందర్భంగా నగరంలో ఆర్య వైశ్య వాసవీ సంస్థల ఆధ్వర్యంలో వన్‌టౌన్ అమ్మవారి ఆలయంలో ఆదివారం తెల్లవారు జాముసుంచి అమ్మవారికి ప్రత్యేక క్షీరాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. స్వర్ణ పుష్పార్చన, వాసవీ హోమం, మహిళలతో సామూహిక సహస్ర నామ పారాయణం, ఉత్సవ మూర్తికి భక్తులతో స్వయంగా క్షీరాభిషేకం నిర్వహించారు. 102 మంది మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నారాయణ సేవ పేరుతో అన్న ప్రసాదం అందించారు. ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారత రత్న ప్రకటించకపోవడం అన్యాయం

ఎన్టీఆర్ కళారాధన పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ఎల్ఎన్ స్వామి



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్వామి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 11: మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు ఎన్టీ రామారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించకపోవడం అన్యాయమని ఎన్టీఆర్ కళారాధన పీఠం (విశాఖ) వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ఎల్ఎన్ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయనకు భారతరత్న ప్రకటించాలని కోరుతున్నా ఫలితంలేకపోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన అభిమానుల ద్వారా ఎన్టీఆర్ పేరు భారతరత్నకు పరిశీలించాలని కోరుతూ 10 వేల లేఖలను రాష్ట్రపతి, ప్రధానమంత్రి, హోంమంత్రులకు పంపించామన్నారు. అయితే, అటునుంచి సమాధానంగా లేఖలు వచ్చాయన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది తప్పకుండా కేంద్రం ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటిస్తుందని ఎంతో ఆశగా ఎదురుచూసిన అభిమానులకు నిరాశే మిగిలిందన్నారు. ఒకరకంగా ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించకుండా బీజేపీ ద్రోహం చేసిందని ఆయన ఆరోపించారు.

సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం

» బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు



మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11: వైసీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. విష్ణుకుమార్‌రాజు మండిపడ్డారు. గ్రేటర్ 26వ వార్డులో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ మేరకు ఆయన ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బంది ఎదుర్కొంటున్నాయన్నారు. అలాగే వార్డులో నిర్మించిన కూరగాయల మార్కెట్ భవనాన్ని సచివాలయంగా మార్చు చేయడం దుర్మార్గమన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కేవీ కుమార్, సీతమ్మధార మండల అధ్యక్షుడు నాగడమూడి నానాజీ, నాయకులు గురుగోవింద్ సింగ్, రఘునాథ్, బొడ్డేటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వేదికగా త్వరలో బీసీ సంఘాల సదస్సు



మాట్లాడుతున్న బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ నాయుడు

మహరాణిపేట ఫిబ్రవరి 10: బీసీ సంఘాలన్నీ సమష్టిగా పోరాడాలని ఆల్ ఇండియా జ్యోతీ రావు పూలే బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు పి. ప్రసాద్ నాయుడు కోరారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి విశాఖ వేదికగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో భారీ సదస్సును నిర్వహించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఆదివారం సంఘ కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం బీహర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కులగణన నిర్వహిస్తున్నాయన్నారు. ఈ రాష్ట్రాలు చేపడుతున్న సర్వేల్లో అమలవుతున్న విధివిధానాలు మిగిలిన రాష్ట్రాలూ పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి పెద్దపీట వేయాలన్నారు.బీసీ ప్రగతికి కృషి చేసిన రాజకీయ పార్టీలకు రానున్న ఎన్నికల్లో మద్దతు అందించాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు సూరాడ దాసు, ఆది వెంకట సత్యనారాయణ, వెంకట బాబ్జీ, ఎర్రయ్య పాల్గొన్నారు.

దర్జాగా ఫుట్‌పాత్ ఆక్రమణ

» రామచంద్రానగర్ 80 అడుగుల రోడ్డులో ఓ వ్యాపారి తీరు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం రామచంద్రానగర్ 80 అడుగుల రోడ్డులో ఓ దుకాణదారుడు ఫుట్‌పాత్ ఆక్రమించుకుని వ్యాపారం సాగిస్తున్నారు. కేంద్రీయ విద్యాలయం వెనుక గేటుకు ఆనుకుని పలు దుకాణాలున్నాయి. రోడ్డుకు ఆనుకుని ఉన్న ఒకరు సిమెంట్, ఇటుకల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో సిమెంట్, ఇటుకలు తెచ్చి ఫుట్‌పాత్‌పైనే నిల్వచేస్తున్నారు. దీంతో ఇక్కడ జీవీఎంసీ ఏర్పాటుచేసిన డస్ట్‌బిన్ల చుట్టూ ఇటుకలు ఆక్రమించడంతో చెత్త తీయడం సాధ్యపడడంలేదు. నడిచేదారికూడా లేకపోవడంతో పాదచారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జీవీఎంసీ వార్డు సచివాలయ సిబ్బందికి ఫోన్ చేసినా పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. 80 అడుగుల రోడ్డు పొడవునా పలుచోట్ల ఫుట్‌పాత్‌లు ఆక్రమణలున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణలు తొలగించాలని కోరు తు న్నారు.



80 అడుగుల రోడ్డులో షాపు యజమాని ఆక్రమణ



ఫుట్‌పాత్‌పై పేర్చిన ఇటుకలు

ఆకట్టుకున్న 'కథన యాత్ర'



కథలు వింటున్న విద్యార్థులు

సీతమ్మధార, ఫిబ్రవరి 11 : విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా కథకురాలు సీతా శ్రీనివాస్‌తో కథనయాత్ర పేరిట సాహిత్య సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని వివిధ పాఠశాలల నుంచి 5-13 ఏళ్ల సుమారు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాంప్రదాయక కథ విభాగంలో బొమ్మలను గీసి, వాటి ద్వారా కథలను (ఆర్ట్ స్కేపింగ్) వివరించారు. సీతా శ్రీనివాస్ అప్పలాచియన్ జానపద కథను విద్యార్థులు కేవలం ప్రేక్షకులుగా మాత్రమే కాకుండా చురుగ్గా అందులో ని మగ్నమయ్యేలా చేశారు. అలాగే, సీతా శ్రీనివాస్ విద్యార్థులతో బొమ్మలను గీయించారు. అప్పలాచియన కథలో ప్రాస, లయ, గానం తదితర అంశాలతో వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఊహాశక్తి, సామూహిక భావ వ్యక్తీకరణ పెంపొందించేలాఉన్న ఈసెషన్ ఆకట్టుకుంది.

వాకర్స్ సభ్యుల ట్రెక్కింగ్



ట్రెక్కింగ్‌కు సిద్ధమవుతున్న సభ్యులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11 : నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న పోర్టు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కంబాల కొండపై ట్రెక్కింగ్ నిర్వహించారు. సభ్యులంతా ఉదయం 7 గంటలకు కొండ వద్దకు చేరుకొని అక్కడ ఉన్న ట్రెక్కింగ్ జోన్‌లో నడకసాగించారు. అనంతరం ప్రత్యేక సమావేశం ఏర్పా టు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామ్ నరేష్ బిర్లంగి పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు చాలా అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు, సెక్రటరీ జీవీఆర్ విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తుది దశలో బర్మాక్యాంపు రోడ్డు విస్తరణ పనులు

మురళీనగర్, ఫిబ్రవరి 11; ఉత్తర నియోజకవర్గం 49వవార్డు పరిధిలో సమస్యాత్మక బర్మాక్యాంపు రోడ్డు విస్తరణ పనులు తుది దశకు చేరాయి. దశాబ్దాల తర్వాత కలెక్టర్ చొరవతో పూర్తికానుండంతో స్థానికులు హర్షంవ్యక్తంచేస్తున్నారు. గతంలో 30 అడుగుల గల బర్మాక్యాంపు రోడ్డు ఇటు ఊర్వశి జంక్షన్ నుంచి అటు మధుసూదన్‌నగర్ వరకు 2.9 కిలో మీటర్ల మేర విస్తరించి ఉండేది. అయితే, ఇరువైపులా వాహనాల పార్కింగ్, దుకాణాల ఆక్రమణలతో అస్తవ్యస్తంగా మారింది. ఈస్థితిలో గత మార్చిలో మాధవధార ఉడాకాలనీలో జరిగిన కాఫీ విత్ కార్పొరేటర్స్, మేయరు కార్యక్రమాల్లో నియోజకవర్గాన్ని గుర్తించారు. ఈ క్రమంలో ఈరోడ్డులో ఆక్రమణలను తొలగించి మరింత విస్తరించారు. అలాగే, కలెక్టరు ఎ.మల్లికార్జున మాధవధార జీవీఎంసీ కల్యాణ మండపంలో ఈ అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సమయంలో ప్రధాన బర్మాక్యాంపు రోడ్డు జీవీఎంసీ మాస్టర్ ప్లాన్‌లో లేనందున ప్రత్యేక దృష్టి సారించి ఆయన ఆదేశాలపై రహదారిని నవీకరించారు. ఎగువ కొండపై ఇళ్ల నివాసితుల ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లను ఫైర్ స్టేషన్ ఎదుట నిలిపేయడంతో తలెత్తుతున్న సమస్యను పరిష్కరించారు. అనంతరం పనులు చురుగ్గా సాగాయి. ప్రస్తుతం ఈ రోడ్డు కొత్త శోభను సంతరించుకుంది.



పూర్తయిన రహదారి

పశ్చిమలో ఓట్ల తొలగింపునకు కుట్ర

... 5వ పేజీ తరువాయి

ప్రయత్నం చేశారు.

అడ్డగోలుగా ఫారం7 దరఖాస్తులు

గోపాలపట్నంలో ఉంటున్న వ్యక్తులు మల్కాపురం, కంచరపాలెంలో నివసిస్తున్న వారి ఓట్లు, గోపాలపట్నం, మల్కాపురంలో ఉన్న వారు శ్రీహరిపురంలో ఉన్న వారి ఓట్లు తొలగించాలని ఫారం-7 దరఖాస్తు చేసినట్టు ఎమ్మెల్యే పరిశీలనలో బయటపడింది. అధికారపార్టీ కీలకనేత కార్యాలయంలో పనిచేసే కొందరు ఉద్యోగులు కూడా లెక్కకు మించి ఫారం-7 దాఖలు చేశారని నిర్ధారించుకున్నారు. విపక్షపార్టీకి చెందిన ఓట్లను తొలగించాలని ఏఈఆర్వోలపై అధికారపార్టీ నేతలు ఒత్తిడి తీసుకువచ్చారని కూడా తెలుసుకున్నారు. అంతేకాకుండా బీఎల్‌వోలకు ఏఈఆర్వోలు రంగంలోకి దిగి అధికారపార్టీ నేతలు సూచించిన మేరకు ఫారం-7 దరఖాస్తులు తీసుకుని, ఓట్లు తొలగించాలని ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఫారం- 7 దరఖాస్తు వివరాలు సేకరించి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్, ఎన్నికల రోల్ అబ్జర్వర్‌కు ఫిర్యాదుచేశారు.

చర్యలపై మీనమేషాలు

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎవరైనా వ్యక్తులు తప్పుడు సమాచారంతో ఫారం-7 దరఖాస్తు చేసినట్టు తేలితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఎమ్మెల్యే గణబాబు ఇచ్చిన ఫిర్యాదుపై రిటర్నింగ్ అధికారి విచారించి, ఫారం-7 తప్పుడు దరఖాస్తులు ఇచ్చారని నిర్ధారించినట్లు తెలిసింది. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు వారు వెనకడుగు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిడితోనే క్రిమినల్ చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందన్న అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

దర్యాప్తుపై ఒత్తిళ్లు!

... 5వ పేజీ తరువాయి

జారీకి తహసీల్దార్‌ను సంప్రదించాడనేది తేలాల్సి ఉంది. అలాగే కన్వేయెన్స్‌డీడ్ జారీ కోసం గంగారావు తహసీల్దార్‌కు భారీగా డబ్బులు ముట్టజెప్పాడని ప్రచారం జరుగుతోంది. అది వాస్తవమైతే అంతమొత్తం గంగారావుకు ఆ డబ్బు ఎవరు ఇచ్చారనేది తేలాల్సి ఉంటుంది. మరోవైపు రమణయ్యకు విజయనగరం జిల్లాకు బదిలీ అయిపోవడంతో ఇంక పని జరగదనే ఆక్రోశంతో గంగారావుకు డబ్బులు సమకూర్చినవారే తహసీల్దార్‌ను హత్య చేయాలనో.. దాడి చేసి బెదిరించాలనో.. ప్రోత్సహించే అవకాశం ఉందంటున్నారు. వీటన్నింటిపైనా పోలీసులు దృష్టిపెడితే ఒక్క రోజులోనే వాస్తవాలు బయటపడతాయని భావిస్తున్నారు.

ఉన్నత స్థాయిలో ఒత్తిడి

రుషికొండలోని తారకరామ లేఅవుట్ ప్రాంతంలోని సుమారు 50 ఎకరాల భూమిని వీఎంఆర్‌డీఏ ఒక సంస్థకు కేటాయించింది. ఆ భూమి పలువురి చేతులు మారి ప్రస్తుతం అధికారపార్టీలోని కీలకనేత బంధువు ఆధీనంలోకి వెళ్లింది. ఆ భూముల్లో నిర్మాణాలు ప్రారంభించిన ఆ కీలకనేత బంధువు నిర్మాణ బాధ్యతలను ప్రస్తుతం గంగారావు పనిచేస్తున్న సంస్థ కు అప్పగించినట్టు సమాచారం. నిర్మాణపనులు జరుగుతుండగానే ఆ భూములు మరోసారి అధికారపార్టీకి చెందిన రాయలసీమ నేత చేతుల్లోకి వెళ్లిపోవడంతో బాధ్యతల నుంచి గంగారావు పనిచేస్తున్న సంస్థను తప్పించారు.తాజాగా తహసీల్దార్ రమణయ్య హత్య నేపథ్యంలో హత్యకు పాల్పడిన గంగారావుతోపాటు తనను కూడా పోలీసులు అరెస్ట్ చేస్తారనే భయంతో గంగారావు పనిచేస్తున్న సంస్థ యజమాని గతంలో అధికారపార్టీకి చెందిన కీలకనేత బంధువును సంప్రదించినట్టు ప్రచారం జరుగుతోంది.ఆ కీలకనేత బంధువు పోలీస్ ఉన్నతాధికారులపై ఒత్తిడి చేయడం వల్లే కేసు దర్యాప్తులో వేగం తగ్గినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసును కొంతకాలంనాన్చిన తర్వాత గంగారావు ఒక్కడే నిందితుడని, హత్య వెనుక మరెవరి ప్రమేయం, ప్రోత్సాహం లేదని పోలీసులు ప్రకటించినాఆశ్చర్యపోనక్కర్లేదని పలువురు రెవెన్యూశాఖ ఉద్యోగులే అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల తీరుపై వారు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సిలబస్ పేరుతో చుక్కలు

... 5వ పేజీ తరువాయి

డీఎస్సీలో పర్‌స్పెక్టివ్ ఎడ్యుకేషన్ ఉంటుంది. ఇందులో నుంచి 20 వరకు బిట్స్ ఇస్తారు. పర్‌స్పెక్టివ్ ఎడ్యుకేషన్‌తోపాటు మిగిలిన సబ్జెక్టులను రిఫర్ చేసేలా తాజాగా డీఎస్సీలో సిలబస్ పెట్టారని, ఇది మరింత ఇబ్బందికరమైన అంశమంటున్నారు. దీనివల్ల మెథడాలజీతోపాటు మిగిలిన సబ్జెక్టులను చదవాలంటున్నారు.

ఏదీ సమయం..?

టెట్ నోటిఫికేషన్‌కు, పరీక్షకు కనీసం మూడు నెలలు, టెట్‌కు, డీఎస్సీకి మధ్య రెండు నెలలు సమయం ఇస్తుం టారు. కానీ తాజాగా టెట్, డీఎస్సీ పరీక్షలకు మధ్య ఉన్న సమయం వారం రోజులు కంటే తక్కువ. సాధారణంగా టెట్ క్వాలిఫై అయిన వారు మాత్రమే డీఎస్సీకి దరఖాస్తు చేస్తారు. కానీ హడావిడి నోటిఫికేషన్‌తో కనీసం పుస్తకాలు తిరగేసేందుకు కూడా అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు. ఈ నెల నుంచి 27 నుంచి మార్చి తొమ్మిది వరకు టెట్ జరగనుంది. మార్చి 14న ఫలితాలు ప్రకటిస్తారు. మార్చి 17 నుంచి 30 వరకు డీఎస్సీ నిర్వహి స్తారు. కాగా టెట్‌కు గతంలో రూ.250 నుంచి రూ.500 వరకు ఫీజు వసూలు చేయగా, తాజాగా దానిని రూ.750కు పెంచారని, డీఎస్సీ ఫీజు గతం లో రూ.వెయ్యి ఉండగా, ఇప్పుడు రూ.1200 చేశారని వాపోతున్నారు.

సత్రం భూములు... అన్యాక్రాంతం!

... 5వ పేజీ తరువాయి

తగ్గడంతో 1923 ప్రాంతంలోనే సత్రం మూతపడిపోయింది. ప్రస్తుతం దాని నామరూపాలు కూడా లేవు. అయితే 1954లో ఈ భూములు భీమిలి బ్లాక్ డెవలప్‌మెంట్ శాఖ అధీనంలోకి తీసుకుని కొంతకాలం పర్యవేక్షణ బాధ్యతలను చూసింది. అనంతరం దేవదాయ ధర్మాదాయ శాఖ ఏర్పాటైన తరువాత 1965లో రికార్డులతో సహా ఆ శాఖకు అప్పగించింది. దీంతో భూములపై పన్నులు కూడా వారే వసూలు చేస్తుండేవారు. కానీ సరైన పర్యవేక్షణ లేకపోవడం, రైతులు, ఇతరుల్లో భూములపై ఆశలు రేకెత్తడంతో క్రమేణా ఆక్రమణలు పెరిగిపోయాయి. అంతేకాకుండా సత్రానికి కేటాయించిన భూములన్నీ ఒకే ప్రాంతంలో లేకపోవడంతో పర్యవేక్షణ బాధ్యతలు కూడా కష్టతరంగా మారాయి. ఇదే అక్రమార్కులకు కలిసివచ్చింది. తమ భూములతో పాటు సత్రం భూములను కలిపేసుకుని, తమ అధీనంలోకి తీసుకునే వెసులుబాటు కలిగింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం భూముల విలువ విపరీతంగా పెరిగిపోవడంతో ఆయా భూములకు వారసులమంటూ కొంతమంది తెరపైకి వచ్చి వీటిలో పక్కా నిర్మాణాలను కూడా చేపట్టారు. మరికొంతమంది షెడ్లు నిర్మించి, అమ్మకాలు కూడా చేపట్టారు.

ఇవీ భూముల వివరాలు

లంగర్‌ఖానా సత్రం నిర్వహణకు వివిధ ప్రాంతాల్లో కేటాయించిన భూములను ప్రస్తుతం సాగుచేస్తున్న వారు అవి తరతరాలుగా తమకు చెందినవేనని నమ్మిస్తున్నారు. ఈ సత్రానికి భీమునిపట్నం మండలం చిల్లపేటలో 65.85 ఎకరాలు, రామజోగి అగ్రహారంలో ఒకచోట 14.61 ఎకరాలు, మరో చోట 7.21 ఎకరాలు, ఇదే గ్రామంలో ఇంకో చోట 1.75 ఎకరాలు కేటాయించారు. అంతేకాకుండా భీమిలిలో 17 ఎకరాలు, కుమ్మరిపాలెంలో రెండు చోట్ల 13.65 ఎకరాల భూములు అప్పగించారు. మిగిలిన భూమి మరిన్ని గ్రామాల పరిధిలో ఉంది.

భూములున్నా ఫలితం సున్నా...

వాస్తవంగా ఇవన్నీ దేవదాయశాఖకు దఖలుపడినవే. వీటిపై ఏటా రూ.లక్షల్లో ఆదాయం రావాల్సి ఉన్నప్పటికీ రూ.వేలల్లో కూడా రావడం లేదు. అంతేకాకుండా భూముల పరిరక్షణకు అధికారులు చేస్తున్న ఖర్చు ఆదాయం కన్నా అనేక రెట్లు ఎక్కువగా ఉందని సమాచారం. ఇంకా అనేక భూములకు సంబంధించిన కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. సత్రానికి చెందిన భూముల వద్ద అనేక ప్రాంతాలలో దేవదాయశాఖ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసింది. హద్దులను నిర్ణయిస్తూ సిమెంటు దిమ్మలను కూడా నిర్మించింది. అయితే వీటిని తొలగించి మరీ అక్రమార్కులు ఆక్రమణలకు తెగబడ్డారు.

పెండింగ్‌లో కేసులు

సత్రం భూములను సాగుచేస్తున్న వారిలో కొంతమంది కోర్టుల్లో కేసులు వేశారు. ఇలా సుమారు 23 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 41 కేసులు ట్రిబ్యునల్‌లో ఉండిపోయాయి. ఈ కేసులు తేలితే తప్ప సత్రం భూముల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. వీటిని త్వరగా తేల్చేందుకు వీలుగా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా ఎలాంటి కేసులు లేని భూములపై ప్రస్తుతం కొంతమంది కన్ను పడింది. లే అవుట్లుగా మార్చి సొమ్ముచేసుకునేందుకు రియల్ వ్యాపారులు కూడా రంగంలోకి దిగినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ భూముల వ్యవహారాన్ని సంగివలస పోలమ్మవారి దేవాలయం ఈవో చూస్తున్నారు.

భూముల రక్షణకు చర్యలు

లంగర్‌ఖానా సత్రం పేరుతో ఉన్న విలువైన భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. కోర్టు కేసుల్లో ఉన్న భూములకు సంబంధించి శాఖ తరఫున పోరాడుతున్నాం. స్టే వెకేషన్ పిటిషన్లు వేశాం. కోర్టు ఉత్తర్వులు వెలువడిన వెంటనే వాటిని అధీనంలోకి తీసుకుంటాం. మిగిలిన భూముల్లో ఆక్రమణల జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- బండారు ప్రసాద్, ఈవో, లంగర్‌ఖానా సత్రం



శారదాపీఠం ముఖద్వారం

15 నుంచి శారదాపీఠం వార్షికోత్సవాలు

పెందుర్తి, ఫిబ్రవరి 11: చినముషిడివాడలోని శారదాపీఠం వార్షికోత్సవాలను పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఐదు రోజుల జరగనున్న ఈ వార్షికోత్సవాల్లో భాగంగా హైందవ ధర్మం విశిష్టతను తెలయజేసేలా ఆధ్యాత్మిక, ధార్మిక సమ్మేళనాలతో కూడిన కార్యక్రమాలను చేపట్టనున్నారు. లోకకల్యాణం, దేశ రక్షణ కోసం పీఠంలో రాజశ్యామల యాగం, చతుర్వేద పారాయణాలు, యజ్ఞయాగాదులను నిర్వహించనున్నారు. విశ్వశాంతి, షణ్ముఖ యాగాలు, రుద్ర, మన్యుసూక్త, శ్రీమేధోదక్షిణామూర్తి, లక్ష్మీగణపతి హోమాలు, దేవతారాధనలో భాగంగా పారాయణ మహా యజ్ఞం చేపట్టనున్నారు. అదేవిధంగా కనకధార స్తోత్రం, ఆదిత్య హృదయం, లలితా, విష్ణుసహస్రనామాల పఠనం, హనుమాన్ చాలీసా పారాయణాలను పఠిస్తారు. పీఠం ప్రాంగణంలోని దేవతామూర్తులు శారదామాత, దాసాంజనేయస్వామి, మేధోదక్షిణామూర్తి, శ్రీవల్లీ సుబ్రహ్మణ్యస్వామిలకు పంచామృతాభిషేకాలు జరుపుతారు. అంతేకాకుండా విష్ణు వేద శాస్త్ర యజ్ఞేశ్వరుడిని ఆరాధించే వేదవిద్వాంసులు శుభకరణాలతో యజ్ఞయాగాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.

వార్షికోత్సవాల వివరాలు

ఈ నెల 15న గురువందనంతో పీఠం వార్షికోత్సవాలకు శ్రీకారం, గణపతి పుణ్యాహవచనం, రుత్విక్ వరుణం, అగ్నిమదనం, రాజశ్యామల యాగం, చతుర్వేద హవనం ప్రారంభం. సాయంత్రం రాజశ్యామల స్వరూప శారద, చంద్రమౌళీశ్వరులకు పీఠపూజ నిర్వహిస్తారు. 16న భ్రమరాంభిక సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, రథసప్తమిని పురస్కరించుకుని త్రిచసౌర విధానంలో సూర్య ఆరాధన, అరుణ పారాయణం, 17న తిరుమల, తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం, 18న శ్రీవల్లీ కల్యాణం, సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం, 19వ రాజశ్యామల యాగానికి మహా పూర్ణాహుతి, మహా అన్నప్రసాద వితరణ చేపడతారు.

కార్మిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

మల్కాపురం, ఫిబ్రవరి 11: ఈ నెల 16న చేపట్టనున్న కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులో కోరారు. ఈ మేరకు ఇక్కడి సీఐటీయు కార్యాలయంలో ఆదివారం ఉదయం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం అన్ని విధాలుగా కార్మికులకు నష్టపరుస్తుందన్నారు. ఈ నెల 13న డాక్‌యార్డు గేటు నుంచి జింక్ గేటు వరకు నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పైడిరాజు, నరేశ్, ప్రేమ్, రాజు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ వాహనం ఎవరిది?

గోపాలపట్నం, ఫిబ్రవరి 11: ఇక్కడి కొత్తపాలెంలోని నాగేంద్రకాలనీ కూడలిలో నెల రోజుల క్రితం ఓ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పార్కింగ్ చేసి విడిచిపెట్టేశారు. రోజులు గడుస్తున్నా ఈ వాహనాన్ని ఎవరూ తీసుకువెళ్లకపోవడంతో ఎవరైనా దీనిని చోరీ చేసి ఇక్కడ విడిచిపెట్టి ఉంటారని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. దీనిపై పోలీసులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.



నాగేంద్రకాలనీ కూడలిలో పార్కింగ్ చేసి ఉన్న బైక్

సినిమా గైడ్

- **ఈగెల్ :** జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శరత్, సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఈగెల్ :** మెలోడి, రమాదేవి, ఊర్వశి (కంచరపాలెం),
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** సంగం, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 18, టమాటా 24, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 40, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 24, క్యారెట్ 22, దొండకాయలు 34, బంగాళదుంపలు 20, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 70, బరబాటి 26, ముల్లంగి 14, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 36, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 32 , కంద 54, దేముడు చిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)


విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	117
ఫారం ధర	--	137
విత్ స్కిన్	--	244
స్కిన్‌లెస్	--	254

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..




పోలింగ్ బూత్ నంబర్-120 ఓటర్ల జాబితాలో ఉన్న మృతి చెందిన వారి పేర్లు

ఓటర్ల జాబితాలో మృతిచెందిన వారికీ ఓట్లు!

00, 01 ఇంటి నంబర్లతోనూ కేటాయింపు
పోలింగ్ బూత్ నంబర్-120లో తప్పుల తడకగా జాబితాలు ఉన్నాయంటూ వెల్లువెత్తుతున్న విమర్శలు

ఆటోనగర్, ఫిబ్రవరి 11: ఓటర్ల తుది జాబితాలో మృతి చెందిన వారికి ఓట్లు ఉండడం పలు విమర్శలకు తావిస్తున్నది. అధికారులు, సిబ్బంది పనితీరులు ఇది నిదర్శనంగా నిలుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ 71వ వార్డు పరిధి తోకాడ పోలింగ్ బూత్ నంబర్-120లోని రత్నాజీ మెమోరియల్ యూనియన్ బిల్డింగ్‌కు సంబంధించిన ఓటర్ల జాబితాలో తప్పులు అధికంగా ఉన్నాయి. మృతి చెందిన సుమారు 25 మందికి ఇప్పుడు ఓటు హక్కు కల్పించడం గమనార్హం. డబుల్ ఎంట్రీ ఓట్లు మూడు, 00, 01 ఇంటి నెంబర్లతో రెండు ఓట్లు ఉన్నట్టు జాబితా ద్వారా స్పష్టమవుతోంది. జాబితాల్లో 1,089 నంబరులోని ఓటరు పేరు ఇతర భాషలో చూపిస్తూ ఓటు హక్కు కల్పించారు. కొందరికి ఒకే పేరుతో రెండేసి ఓట్లు కూడా ఉండడం విశేషం. కాగా 2019లో ఓట్లు లేని ఎనిమిది మంది మృతి చెందిన వారి పేర్లు 2024 జాబితాలో ఎలా చేరాయో అర్థం కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన వారికి అధికారులు, సిబ్బంది ఎలా ఓటు హక్కు కల్పించారో అర్థం కావడం లేదని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీకి చెందిన వారే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ దొంగ ఓట్లను నమోదు చేయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



ఒకే వ్యక్తికి రెండేసి ఓట్లు చొప్పున..



00, 01 డోర్ నంబర్లతో ఉన్న ఓటర్లు

సీసీ కెమెరాలతో నిరంతర నిఘా

- పారిశ్రామిక ప్రాంతంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు
- చోరీల నియంత్రణతో పాటు, ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్
- ఫలిస్తున్న పోలీసుల చర్యలు

గాజువాక, ఫిబ్రవరి 11: పారిశ్రామిక ప్రాంతంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ భద్రత చర్యలు చేపడుతున్నారు. గాజువాక పరిధిలోని కీలక జంక్షన్‌లలో గతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, మిగిలిన జంక్షన్‌లలో ఇటీవల ఏర్పాటు చేశారు. ఇవి రోడ్డు ప్రమాద కేసుల్లో ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం పాతగాజువాక, కొత్తగాజువాక, సినిమాహాల్, పంతులుగారిమేడ, ఆటోనగర్, బీహెచ్‌పీవీ, నాతయ్యపాలెం, షీలానగర్, చినగంట్యాడ, వంద అడుగుల రోడ్డు, శ్రీనగర్, వడ్లపూడి, కూర్మన్నపాలెం, అగనంపూడి, లంకెలపాలెం ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. ప్రతి వాణిజ్య సముదాయం, అపార్ట్‌మెంట్లు, పెట్రోల్ బంకులు, బ్యాంకులు, హోటళ్లు, ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేసే విధంగా పోలీసులు చర్యలు తీసుకున్నారు.



గాజువాక కూడలిలో సీసీ కెమెరాలు

నెరవేరిన దశాబ్దాల కల

ఎట్టకేలకు పాపయ్యరాజుపాలెంలో తారు రోడ్డు నిర్మాణం



భవానీనగర్ నుంచి వసంత గార్డెన్స్ వరకు వేసిన తారు రోడ్డు

పెందుర్తి-రూరల్, ఫిబ్రవరి 11: జీవీఎంసీ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం, లక్ష్మీపురం పరిసర ప్రాంతాల ప్రజల దశాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరింది. లక్ష్మీపురం నుంచి పాపయ్యరాజుపాలెం మార్గంలో తారు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. పెందుర్తి మండల కేంద్రానికి, వార్డు కేంద్రానికి, పాలిటెక్నిక్, జూనియర్ కళాశాల, ఆరోగ్య కేంద్రాలకు వెళ్లడానికి ఇది దగ్గర దారి కావడం వల్ల లక్ష్మీపురం పరిసరాల్లో ఉన్న పది గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహనాలు, సైకిళ్లతో నిత్యం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. రెండు కిలోమీటర్ల పొడవు గల ఈ మార్గంలో సుమారు కిలోమీటరున్నర (భవానీనగర్ నుంచి వసంత గార్డెన్స్) వరకు మట్టితో నిండి ఉండేది. వానొస్తే రోడ్డు మొత్తం బురదమయంగా మారడంతో ప్రజలు నానాపాట్లు పడేవారు. స్థానికులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పించడంతో ఎట్టకేలకు రహదారికి మోక్షం లభించింది. కార్పొరేటర్ దేముడు ఈ సమస్యను మేయర్ జి.హరి వెంకటకుమారికి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె ప్రత్యక్షంగా ఈ రోడ్డును పరిశీలించి కోటి రూపాయల నిధులు విడుదల చేయడంతో ఎట్టకేలకు రహదారి నిర్మాణానికి నోచుకో వడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎట్టకేలకు శ్రీసాయినగర్‌లో రోడ్డు నిర్మాణం

వేపగుంట: జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని గోశాల జంక్షన్‌లో బీఆర్‌టీఎస్ రహదారికి అనుసంధానంగా ఉన్న శ్రీసాయినగర్ కాలనీ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ సర్వీసు రోడ్డు అధ్వానంగా మారడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉండేవి. ప్రజల విజ్ఞప్తి మేరకు ఎట్టకేలకు రూ.15 లక్షలతో సీసీ రోడ్డును నిర్మించడం పట్ల ఆయా ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సాయినగర్‌లో కొత్తగా వేసిన సీసీ రోడ్డు

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 11: స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,095వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల ముందే ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, లేదా సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రకటించిన ప్రభుత్వాలకే ఉక్కు కార్మికులు, నిర్వాసితులు మద్దతివ్వాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ వందలాది రోజులుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమన్నారుజ ఉక్కు పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా వెనకాడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె.రామకృష్ణ, సన్యాసిరావు, పరంధామయ్య, భాస్కర్, బైరెడ్డి, మస్తానప్ప, వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రామచంద్రరావు



దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

దీనదయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

గాజువాక, ఫిబ్రవరి 11: భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని ఆదివారం పాతకర్నవానిపాలెంలో గాజువాక నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీనదయాళ్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనదయాళ్ సేవలను కొనియాడారు. దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయ సాధనకు బీజేపీ కార్యకర్తలందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సోంబాబు, రాజశేఖర్, నాయుడు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు. 70వ వార్డు ఎల్‌వీ నగర్‌లో బీజేపీ నగర ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు, పావని ఆధ్వర్యంలో, 86వ వార్డు భరత్ నగర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొండా ఎల్లాజీ, వడ్లపూడికి చెందిన నాయకురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో దీనదయాళ్ వర్ధంతిని నిర్వహించారు.

రామాలయానికి ఉయ్యాల బహూకరణ

అగనంపూడి, ఫిబ్రవరి 11: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం రామాలయానికి కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆదివారం ఉయ్యాలను ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయంలో జరిగే నిత్య పూజల్లో భాగంగా స్వామివారికి ఊంజల సేవ చేపట్టేందుకు దీనిని సమకూర్చినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎస్.అప్పారావు, వై.వెంకటరావు, రామారావు, శంకరరావు, నూకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వైసీపీని గద్దె దించాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 11: వైసీపీ పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు ఎన్టీఆర్ నగర్‌లో ఆదివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీని గద్దె దించి టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు అందరూ కృషి చేయాలని కోరారు. నవరత్నాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతామని అధికారంలోకి వచ్చిన జగన్ నవ మోసాలతో ప్రజల జీవితాలను అంధకారం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయరామరాజు, వర్రె రాంబాబు, ఎస్.పెంటారావు, కె.శ్రీను, మూర్తి, శ్రీనివాసవర్మ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వార్డు అధ్యక్షులకు నియామక పత్రాలు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 11: దేశంలో, రాష్ట్రంలోనూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలించే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు 64వ వార్డు అధ్యక్షునిగా నియమితులైన యరబాల భూలోక, 65వ వార్డు అధ్యక్షుడు ఎంఎస్ వర్మలకు ఆదివారం చినగంట్యాడలో జరిగిన కార్యక్రమంలో ముత్యాలు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ములకపల్లి రాజబాబు, కట్టా అప్పారావు, ఎస్.హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 11: జీవీఎంసీ 86వ వార్డు పరిధి శాతవాహననగర్‌లో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రధాన అర్చకులు శ్రీధర్‌స్వామి, నండూరు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర శతనామాలతో, అర్చనలు, అభిషేకాలు జరిపారు. అనంతరం అంజనీపుత్రునికి సిందూరం, తమలపాకులతో పూజలు చేసి గారెలు, బూరెలతో సుందరంగా అలంకరించారు. కాట్రగడ్డ దుర్గాప్రసాద్, జ్యోతి దంపతులు ఆర్థిక సహాయంతో సమకూర్చిన వెండి ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. పలువురు మహిళలు సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసాను పఠించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



బ్యానర్, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పంచగ్రామాల సమస్యను పరిష్కరించాలని ర్యాలీ

వేపగుంట, ఫిబ్రవరి 11: వేపగుంట పరిసర ప్రాంతాల ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న దేవస్థాన, వుడా భూముల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పార్టీలకతీతంగా స్థానిక యువకులు, గ్రామ పెద్దలు ఆదివారం ర్యాలీ చేపట్టారు. ముందుగా వేపగుంట ముత్యాలమ్మ గుడి నుంచి ప్రారంభమైన ర్యాలీ వేపగుంట కూడలిలో కొద్దిసేపు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం ప్లకార్డులు పట్టుకుని ఆర్.ఆర్.వి.పురం వరకు ర్యాలీ చేశారు.

జిరాక్స్ పాస్‌లతో వస్తే నో ఎంట్రీ..

స్టీల్‌ప్లాంట్ వద్ద విస్తృతంగా తనిఖీలు చేపడుతున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 11: స్టీల్‌ప్లాంట్‌లోకి వెళ్లేందుకు జిరాక్స్ పాస్‌లతో వస్తే అనుమతించేది లేదని ఉక్కు సీఐఎస్ఎఫ్ అధికారులు స్పష్టం చేశారు. అందువల్ల ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఒరిజినల్ పాస్‌లతో రావాలన్నారు. కొంతమంది కలర్ జిరాక్స్ పాస్‌లతో ప్లాంట్‌లోకి ప్రవేశిస్తున్నారన్న సమాచారం అందడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎవరైనా ఒరిజినల్‌కు బదులుగా కలర్ పాస్‌లతో ప్లాంట్‌లోకి ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు తమ పాస్‌ల కలర్ జిరాక్స్‌లను ఇతరులకు ఇవ్వరాదని సూచించారు. ఈ నేపథ్యంలో ఉక్కు ప్రధాన గేటు, విస్తరణ గేటు, బీసీ గేటు వద్ద అదనపు సీఐఎస్ఎఫ్ సిబ్బందిని నియమించి కర్మాగారంలోకి వెళ్లే ప్రతిఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ప్లాంట్‌లో లోపల కూడా ప్రతి విభాగం వద్ద అదనపు సిబ్బందిని నియమించారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సీఐఎస్ఎఫ్ అధికారులకు, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఘనంగా కనకదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట

మల్కాపురం, ఫిబ్రవరి 11: గ్రేటర్ 59వ వార్డు కొత్తనక్కవానిపాలెంలో శ్రీకృష్ణ యాదవ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కనకదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గారిడీ కళాకారులతో సారెను ఊరేగింపు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, మాజీ కార్పొరేటర్ వసంత కల్యాణి, గ్రామ పెద్దలు బంగారురాజు, హరిబాబు, పైడిరాజు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 11: మంచి పుస్తకాలను చదవడం ద్వారా తమ విజ్ఞానాన్ని పెంచుకోవాలని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వార్తా పత్రికలు చదవడం ద్వారా నేటి సమాజ పరిస్థితులు, చారిత్రాత్మక పుస్తకాలను చదవడం ద్వారా నాటి పరిస్థితులు తెలుసుకోవచ్చన్నారు. అందువల్ల విద్యార్థులంతా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.

యాతపాలెంలో అరకొరగా తాగునీటి సరఫరా

పెదగంట్యాడ, ఫిబ్రవరి 11: జీవీఎంసీ 64వ వార్డు పరిధి యాతపాలెం గ్రామానికి తాగునీటి సౌకర్యం అరకొరగా జరుగుతుంది. కొళాయిల ద్వారా రెండు రోజులకోసారి తక్కువ మోతాదులో అరగంట పాటు మాత్రమే నీరు వస్తుంది. కొండవాలు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లకు సుమారు 20 నిమిషాల పాటు మాత్రమే నీరు వస్తుండడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొళాయిల నుంచి వచ్చే నీరు చాలకపోవడంతో వీధుల్లోని బోరింగులను ఆశ్రయించాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. కాగా గ్రామంలోని అనేక బోరింగులు మరమ్మతులతో మూలకు చేరాయని, దీంతో నీటి కోసం నానాపాట్లు పడుతున్నామని వారు వాపోతున్నారు. ఈ విషయాన్ని జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినల ఫలితం లేకుండా పోయిందని స్థానిక నాయకుడు సంపంగి సూరిబాబు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటిని ప్రతిరోజూ గంటపాటు పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఏబీఎస్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

అగనంపూడి, ఫిబ్రవరి 11: గ్రేటర్ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెంలో గల ఏబీఎస్ పబ్లిక్ స్కూల్ 18వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైసీపీ 'గాజువాక' ఇన్‌చార్జి ఉరుకూటి చందు, కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, ఇల్లపు వరలక్ష్మి, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీ రామునాయుడు, టీడీపీ నాయకుడు కర్రి దశేంద్ర, ఎంఈవోలు సాయిశైలజ, దివాకర్, స్కూల్ కరస్పాండెంట్ కొండయ్య, డైరెక్టర్ దీపక్, ప్రిన్సిపాల్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ నూతన కార్యవర్గం

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 11: సామాజిక సేవల్లో వాసవి క్లబ్ ఇతర క్లబ్‌లకు ఆదర్శంగా నిలవాలని వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ వీవీ గుప్తా అన్నారు. అక్కిరెడ్డిపాలెంలో ఆదివారం జరిగిన అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం వాసవి క్లబ్ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షునిగా నున్న గాంధీగుప్త, కార్యదర్శిగా జి.కుమార్‌స్వామి, కోశాధికారిగా ఎన్.శ్రీరామమూర్తి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సునీత, సతీష్, నాగేశ్వరరావు, సతీశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా టైలర్లు ఐక్యం కావాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 11: టైలర్లందరూ రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉన్నప్పుడే తమ సమస్యలను పరిష్కరించుకోగలరని న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ అన్నారు. రామ్‌నగర్‌లో ఆదివారం జరిగిన దుర్గా టైలర్స్ అసోసియేషన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో ప్రతినిధులు టి.పుల్లయ్యనాయుడు, కనకేశ్వరరావు, సత్యనారాయణ, వెంకటరమణ, పి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు

ఆటోనగర్, ఫిబ్రవరి 11: జీవీఎంసీ 70వ వార్డు చట్టివానిపాలెం శివాలయంలో సూర్య భగవానుడు ఆలయంలో మాఘ ఆదివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి కిశోర్‌శర్మ పర్యవేక్షణలో పంచామృతాభిషేకాలు, అర్చనలు, నవగ్రహ పూజలు చేశారు. అనంతరం పుష్పమాలలతో స్వామివారిని అలంకరించాక పాలు, పండ్ల రసాలు, పంచదార, రేగుపండ్లు, చెరకు గడలు, కందమూల దుంపలు, కిస్మిస్, జీడిపప్పుతో తయారుచేసిన పరమాన్నాన్ని చిక్కుడు ఆకులలో ఉంచి నైవేద్యంగా సమర్పించారు. పలువురు భక్తులు నవగ్రహ స్తోత్రాలను, ఆదిత్య హృదయాన్ని పఠించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తుల అధిక సంఖ్యలో విచ్చేసి ఆదిత్యున్ని దర్శించుకున్నారు.



ఘంటసాల గీతాలాపన



గాయకుడు చిట్టిబాబును సత్కరిస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11 : దివంగత సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 49వ వర్ధంతి కార్యక్రమాన్ని రైల్వేన్యూకాలని ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆలయ వ్యవస్థాపకుడు నూకల శేషగిరిరావు, గాయకుడు గల్లాచిట్టిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఘంటసాల భక్తి గీతాలను గల్లా చిట్టిబాబు ఆలపించారు.అనంతరంఆయనకు ఘనంగా సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు పరీక్ష చేస్తున్న డాక్టర్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11: గ్రేటర్ 44వ వార్డు నందగిరినగర్‌లో ఆదివారం శ్రీ నందగిరినగర్ సేవా సంఘం, లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానికులకు వైద్య సిబ్బంది వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండీ కాండ్రుగుల వెంకట రామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా వివిధ ప్రాంతాల్లో పేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అప్సా' రాష్ట్ర ఉపాధ్యక్షునిగా శ్రీనివాసరావు నియామకం

కంచరపాలెం, ఫిబ్రవరి 11 : ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నగరానికి చెందిన బి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆదివారం తిరుపతిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనకు నియామక పత్రాన్ని సంఘం ప్రతినిధులు అందజేశారు. కాగా, శ్రీనివాసరావు కంచరపాలెంలో న్యూటన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్‌గా ఉన్నారు. ప్రైవేట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావును అభినందించారు.

రాష్ట్ర కార్యదర్శిగా చీకటి రమేష్...

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా చీకటి రమేష్ ఎంపికయ్యారు. ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి సంఘ సమావేశంలో విశాఖకు చెందిన జనసేన నేత చీకటి రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు.

వైభవంగా శ్రీనివాస కల్యోణోత్సవం

సీతమ్మధార, ఫిబ్రవరి 11 : స్థానిక టీపీటీ కాలనీ ద్రావిడ సంక్షేమ సంఘం కల్యాణమండపంలో శృతిలయ ఆధ్యాత్మిక భక్తి సంకీర్తన సేవా సంస్థ వ్యవస్థాపకుడు విప్రభాకర్ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం శ్రీనివాస కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శృతిలయ బృంద గాయకులు కల్యాణోత్సవంలో మధుర ఘట్టాలకు సన్నివేశాలకు అనుగుణంగా అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించారు. గురువు కేపీ రాజు, ఆచార్య జీఎస్ఎన్ రాజు, వంకాయల సన్యాసిరాజు, డాక్టర్ ఎస్ఏఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11: నిర్వహణ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. బీఎస్ లే అవుట్, నరసింహనగర్, పద్మశ్రీ హాస్పిటల్ ఏరియా, ఎన్‌జీజీఓస్ కాలనీ, జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఏరియా, చిన్నూరు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో వలంటీర్లకు చుక్కెదురు

» చేయూత పథకం కోతపై నిలదీత

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 11: జీవీఎంసీ 30 వార్డులో ఆదివారం ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో వలంటీర్లకు చుక్కెదురైంది. ప్రభుత్వం రూ. 25లక్షలకు వైద్యసాయం పెంచి అప్‌గ్రేడ్ చేసిన కొత్త కార్డులను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తున్న వలంటీర్లకు ఇతర సంక్షేమ పథకాలు కోత విధింపులపై మహిళలు నిలదీశారు. వైఎస్ఆర్ చేయూత పథకంలో తమను అనర్హులుగా చేశారంటూ వలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా అర్హత కలిగిన తమకు అధిక కరెంట్ వినియోగం పేరిట పథకం నుంచి తప్పించడంపై కుమ్మరవీధి, జెండాచెట్టు, శాలిపేట, ఏనుగుల వీధి, చెంగలరావుపేట ప్రాంతాల్లోని మహిళలు నిలదీశారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ కార్డులున్నాయని, మళ్లీ కొత్తగా ఎందుకు అంటూ నిలదీశారు. దీంతో వలంటీర్లు రూ. 25లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలందుతాయంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ పేరుతో ఉన్న కార్డుల స్థానంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులుగా జగన్ బొమ్మతో పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎన్నికల దృష్ట్యా మరోమారు కార్డుల పంపిణీ పేరుతో ఓటర్లకు వలవేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నట్టు ప్రజలు బహిరంగ విమర్శలకు దిగారు.

ఘనంగా కోస్టుగార్డు రైజింగ్ డే



సముద్రంలో నౌక, హెలికాప్టర్ల ప్రదర్శన

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కోస్టుగార్డు 46వ రైజింగ్ డే వేడుకలు ఆదివారం మల్కాపురంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డేఎటీసీ నిర్వహించి కోస్టుగార్డుకు చెందిన నౌకలు, విమానాల ప్రదర్శన చేపట్టారు. సముద్రంలో కోస్టుగార్డు నిర్వహించే కార్యకలాపాలకు సంబంధించి పలు అంశాలను డే ఎటీసీలో ప్రదర్శించారు.



చీకటి అలుముకున్న సింహపురి కాలనీ



ట్రాన్స్‌ఫార్మర్‌కు పొదలు అల్లుకుంటున్న దృశ్యం

అంధకారంలో కొండవాలు ప్రాంతాలు

» వీధిదీపాలు లేని వైనం.. రాత్రివేళల్లో రాకపోకలకు అవస్థలు

» పాములు, విషకీటకాల సంచారంతో స్థానికుల్లో భయం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11: గ్రేటర్ 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో వీధి లైట్లు లేక అంధకారం రాజ్యమేలుతోంది. రాత్రివేళల్లో ఆ ప్రాంత వాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కొండవాలు ప్రాంతాలు కావడంతో పాములు, విష కీటకాలు సంచరించే అవకాశం ఉండడంతో మరింత భయాందోళనకు గురవుతున్నారు.ఏడాది క్రితం వీధుల్లో 13 విద్యుత్ స్తంభాలు వేశారు. అనంతరం నాలుగు నెలల తర్వాత కేవలం 10 చోట్ల వీధిలైట్లు మాత్రమే వేసి మిగిలినవి అలాగే వదిలేశారు. వార్డులో వీధిదీపాల సమస్యపై స్థానికులు పలుమార్లు విద్యుత్‌శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదు. సింహగిరికాలనీలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పలుమార్లు కోరినా లైట్లు లేవని విద్యుత్ శాఖ సిబ్బంది సమాధానమిస్తున్నట్టు మండిపడుతున్నారు. కాలనీలోకి వెళ్లే ప్రధానదారి లోనూ వీధి దీపాలు లేవు. అయినా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చీకటయితే తాము వీధుల్లో తిరగడానికి భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్ల నుంచి హైమాస్ట్ లైట్ వేయాలని విన్నవించుకుంటున్నా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోక్ నేరుగా విద్యుత్‌శాఖాధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కార్పొరేటర్ మాటే లెక్క చేయడంలేదు..



సింహగిరి కాలనీలో రెండేళ్ల క్రితం కొత్తగా లైటు వేయాలని కోరినా, విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోలేదు. కార్పొరేటర్ కంపా హనోక్ సుమారు 20 సార్లు విద్యుత్ శాఖకు ఈసమస్య విన్నవించారు. అయినా ఆయన మాట కూడా లెక్క చేయలేదు. చీకటిపడితే పాములు, విషకీటకాలు సంచరిస్తుంటాయి. ఇకనైనా ఉన్నతాధికారులు వీధి లైట్లు వేసేలా చర్యలు తీసుకోవాలి.

-కె. నాయుడు, సింహగిరికాలనీ, 45వ వార్డు

కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

మహారాణిపేట ఫిబ్రవరి 10: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. 1014 ఏళ్ల కింద వైశ్య జాతిని జాగృతి పరచి తనతోపాటు 102 మంది ఆర్యవైశ్య దంపతులను అగ్ని గుండంలోకి నడిపించి శివైక్యం పొందిన రోజైన మాఘ మాసం విదియ నాడు వైశ్యులు ఏటా వాసవీ మాత ఆత్మర్పణ దినోత్స వం నిర్వ హిస్తారు. ఈసందర్భంగా నగరంలో ఆర్య వైశ్య వాసవీ సంస్థల ఆధ్వర్యంలో వన్‌టౌన్ అమ్మవారి ఆలయంలో ఆదివారం తెల్లవారు జామునుంచి అమ్మవారికి ప్రత్యేక క్షీరాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. స్వర్ణ పుష్పార్చన, వాసవీ హోమం, మహిళలతో సామూహిక సహస్ర నామ పారాయణం, ఉత్సవ మూర్తికి భక్తులతో స్వయంగా క్షీరాభిషేకం నిర్వహించారు. 102 మంది మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నారాయణ సేవ పేరుతో అన్న ప్రసాదం అందించారు. ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.



అలంకరణలో కన్యకాపరమేశ్వరి

సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం

» బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11: వైసీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. విష్ణుకుమార్‌రాజు మండిపడ్డారు. గ్రేటర్ 26వ వార్డులో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ మేరకు ఆయన ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బంది ఎదుర్కొంటున్నాయన్నారు. అలాగే వార్డులో నిర్మించిన కూరగాయల మార్కెట్ భవనాన్ని సచివాలయంగా మార్చు చేయడం దుర్మార్గమన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కేవీ కుమార్, సీతమ్మధార మండల అధ్యక్షుడు నాగడమూడి నానాజీ, నాయకులు గురుగోవింద్ సింగ్, రఘునాథ్, బొడ్డేటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

ఎన్టీఆర్‌కు భారత రత్న ప్రకటించకపోవడం అన్యాయం

ఎన్టీఆర్ కళారాధన పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ఎల్ఎన్ స్వామి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 11: మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు ఎన్టీ రామారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించకపోవడం అన్యాయమని ఎన్టీఆర్ కళారాధన పీఠం (విశాఖ) వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ఎల్ఎన్ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయనకు భారతరత్న ప్రకటించాలని కోరుతున్నా ఫలితంలేకపోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన అభిమానుల ద్వారా ఎన్టీఆర్ పేరు భారతరత్నకు పరిశీలించాలని కోరుతూ 10 వేల లేఖలను రాష్ట్రపతి, ప్రధానమంత్రి, హోంమంత్రులకు పంపించామన్నారు. అయితే, అటునుంచి సమాధానంగా లేఖలు వచ్చాయన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది తప్పకుండా కేంద్రం ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటిస్తుందని ఎంతో ఆశగా ఎదురుచూసిన అభిమానులకు నిరాశే మిగిలిందన్నారు. ఒకరకంగా ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించకుండా బీజేపీ ద్రోహం చేసిందని ఆయన ఆరోపించారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్వామి

విశాఖ వేదికగా త్వరలో బీసీ సంఘాల సదస్సు

మహారాణిపేట ఫిబ్రవరి 10: బీసీ సంఘాలన్నీ సమష్టిగా పోరాడాలని ఆల్ ఇండియా జ్యోతీ రావు పూలే బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు పి. ప్రసాద్ నాయుడు కోరారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి విశాఖ వేదికగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో భారీ సదస్సును నిర్వహించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కులగణన నిర్వహిస్తున్నాయన్నారు. ఈ రాష్ట్రాలు చేపడుతున్న సర్వేల్లో అమలవుతున్న విధివిధానాలు మిగిలిన రాష్ట్రాలూ పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి పెద్దపీట వేయాలన్నారు.బీసీ ప్రగతికి కృషి చేసిన రాజకీయ పార్టీలకు రానున్న ఎన్నికల్లో మద్దతు అందించాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు సూరాడ దాసు, ఆది వెంకట సత్యనారాయణ, వెంకట బాబ్జీ, ఎర్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ నాయుడు

దర్జాగా ఫుట్‌పాత్ ఆక్రమణ

» రామచంద్రానగర్ 80 అడుగుల రోడ్డులో ఓ వ్యాపారి తీరు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం రామచంద్రానగర్ 80 అడుగుల రోడ్డులో ఓ దుకాణదారుడు ఫుట్‌పాత్ ఆక్రమించుకుని వ్యాపారం సాగిస్తున్నారు. కేంద్రీయ విద్యాలయం వెనుక గేటుకు ఆనుకుని పలు దుకాణాలున్నాయి. రోడ్డుకు ఆనుకుని ఉన్న ఒకరు సిమెంట్, ఇటుకల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో సిమెంట్, ఇటుకలు తెచ్చి ఫుట్‌పాత్‌పైనే నిల్వచేస్తున్నారు. దీంతో ఇక్కడ జీవీఎంసీ ఏర్పాటుచేసిన డస్ట్‌బిన్ల చుట్టూ ఇటుకలు ఆక్రమించడంతో చెత్త తీయడం సాధ్యపడడంలేదు. నడిచేదారికూడా లేకపోవడంతో పాదచారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జీవీఎంసీ వార్డు సచివాలయ సిబ్బందికి ఫోన్ చేసినా పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. 80 అడుగుల రోడ్డు పొడవునా పలుచోట్ల ఫుట్‌పాత్‌లు ఆక్రమణలున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణలు తొలగించాలని కోరు తు న్నారు.



80 అడుగుల రోడ్డులో షాపు యజమాని ఆక్రమణ



ఫుట్‌పాత్‌పై పేర్చిన ఇటుకలు

ఆకట్టుకున్న 'కథన యాత్ర'



కథలు వింటున్న విద్యార్థులు

సీతమ్మధార, ఫిబ్రవరి 11 : విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ, భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా కథకురాలు సీతా శ్రీనివాస్‌తో కథనయాత్ర పేరిట సాహిత్య సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని వివిధ పాఠశాలల నుంచి 5-13 ఏళ్ల సుమారు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాంప్రదాయక కథ విభాగంలో బొమ్మలను గీసి, వాటి ద్వారా కథలను (ఆర్ట్ స్కేపింగ్) వివరించారు. సీతా శ్రీనివాస్ అప్పలాచియన్ జానపద కథను విద్యార్థులు కేవలం ప్రేక్షకులుగా మాత్రమే కాకుండా చురుగ్గా అందులో ని మగ్నమయ్యేలా చేశారు. అలాగే, సీతా శ్రీనివాస్ విద్యార్థులతో బొమ్మలను గీయించారు. అప్పలాచియన కథలో ప్రాస, లయ, గానం తదితర అంశాలతో వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఊహాశక్తి, సామూహిక భావ వ్యక్తీకరణ పెంపొందించేలాఉన్న ఈసెషన్ ఆకట్టుకుంది.

వాకర్స్ సభ్యుల ట్రెక్కింగ్



ట్రెక్కింగ్‌కు సిద్ధమవుతున్న సభ్యులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11 : నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న పోర్టు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కంబాల కొండపై ట్రెక్కింగ్ నిర్వహించారు. సభ్యులంతా ఉదయం 7 గంటలకు కొండ వద్దకు చేరుకొని అక్కడ ఉన్న ట్రెక్కింగ్ జోన్‌లో నడకసాగించారు. అనంతరం ప్రత్యేక సమావేశం ఏర్పా టు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామ్ నరేష్ బిర్లంగి పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు చాలా అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు, సెక్రటరీ జీవీఆర్ విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తుది దశలో బర్మాక్యాంపు రోడ్డు విస్తరణ పనులు

మురళీనగర్, ఫిబ్రవరి 11; ఉత్తర నియోజకవర్గం 49వవార్డు పరిధిలో సమస్యాత్మక బర్మాక్యాంపు రోడ్డు విస్తరణ పనులు తుది దశకు చేరాయి. దశాబ్దాల తర్వాత కలెక్టర్ చొరవతో పూర్తికానుండంతో స్థానికులు హర్షంవ్యక్తంచేస్తున్నారు. గతంలో 30 అడుగుల గల బర్మాక్యాంపు రోడ్డు ఇటు ఊర్వశి జంక్షన్ నుంచి అటు మధుసూదన్‌నగర్ వరకు 2.9 కిలో మీటర్ల మేర విస్తరించి ఉండేది. అయితే, ఇరువైపులా వాహనాల పార్కింగ్, దుకాణాల ఆక్రమణలతో అస్తవ్యస్తంగా మారింది. ఈస్థితిలో గత మార్చిలో మాధవధార ఉడాకాలనీలో జరిగిన కాఫీ విత్ కార్పొరేటర్స్, మేయరు కార్యక్రమాల్లో నియోజకవర్గాన్ని గుర్తించారు. ఈ క్రమంలో ఈరోడ్డులో ఆక్రమణలను తొలగించి మరింత విస్తరించారు. అలాగే, కలెక్టరు ఎ.మల్లికార్జున మాధవధార జీవీఎంసీ కల్యాణ మండపంలో ఈ అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సమయంలో ప్రధాన బర్మాక్యాంపు రోడ్డు జీవీఎంసీ మాస్టర్ ప్లాన్‌లో లేనందున ప్రత్యేక దృష్టి సారించి ఆయన ఆదేశాలపై రహదారిని నవీకరించారు. ఎగువ కొండపై ఇళ్ల నివాసితుల ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లను ఫైర్ స్టేషన్ ఎదుట నిలిపేయడంతో తలెత్తుతున్న సమస్యను పరిష్కరించారు. అనంతరం పనులు చురుగ్గా సాగాయి. ప్రస్తుతం ఈ రోడ్డు కొత్త శోభను సంతరించుకుంది.



పూర్తయిన రహదారి

పశ్చిమలో ఓట్ల తొలగింపునకు కుట్ర

... 5వ పేజీ తరువాయి

ప్రయత్నం చేశారు.

అడ్డగోలుగా ఫారం7 దరఖాస్తులు

గోపాలపట్నంలో ఉంటున్న వ్యక్తులు మల్కాపురం, కంచరపాలెంలో నివసిస్తున్న వారి ఓట్లు, గోపాలపట్నం, మల్కాపురంలో ఉన్న వారు శ్రీహరిపురంలో ఉన్న వారి ఓట్లు తొలగించాలని ఫారం-7 దరఖాస్తు చేసినట్టు ఎమ్మెల్యే పరిశీలనలో బయటపడింది. అధికారపార్టీ కీలకనేత కార్యాలయంలో పనిచేసే కొందరు ఉద్యోగులు కూడా లెక్కకు మించి ఫారం-7 దాఖలు చేశారని నిర్ధారించుకున్నారు. విపక్షపార్టీకి చెందిన ఓట్లను తొలగించాలని ఏఈఆర్వోలపై అధికారపార్టీ నేతలు ఒత్తిడి తీసుకువచ్చారని కూడా తెలుసుకున్నారు. అంతేకాకుండా బీఎల్‌వోలకు ఏఈఆర్వోలు రంగంలోకి దిగి అధికారపార్టీ నేతలు సూచించిన మేరకు ఫారం-7 దరఖాస్తులు తీసుకుని, ఓట్లు తొలగించాలని ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఫారం- 7 దరఖాస్తు వివరాలు సేకరించి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్, ఎన్నికల రోల్ అబ్జర్వర్‌కు ఫిర్యాదుచేశారు.

చర్యలపై మీనమేషాలు

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎవరైనా వ్యక్తులు తప్పుడు సమాచారంతో ఫారం-7 దరఖాస్తు చేసినట్టు తేలితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఎమ్మెల్యే గణబాబు ఇచ్చిన ఫిర్యాదుపై రిటర్నింగ్ అధికారి విచారించి, ఫారం-7 తప్పుడు దరఖాస్తులు ఇచ్చారని నిర్ధారించినట్లు తెలిసింది. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు వారు వెనకడుగు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిడితోనే క్రిమినల్ చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందన్న అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

దర్యాప్తుపై ఒత్తిళ్లు!

... 5వ పేజీ తరువాయి

జారీకి తహసీల్దార్‌ను సంప్రదించాడనేది తేలాల్సి ఉంది. అలాగే కన్వేయెన్స్‌డీడ్ జారీ కోసం గంగారావు తహసీల్దార్‌కు భారీగా డబ్బులు ముట్టజెప్పాడని ప్రచారం జరుగుతోంది. అది వాస్తవమైతే అంతమొత్తం గంగారావుకు ఆ డబ్బు ఎవరు ఇచ్చారనేది తేలాల్సి ఉంటుంది. మరోవైపు రమణయ్యకు విజయనగరం జిల్లాకు బదిలీ అయిపోవడంతో ఇంక పని జరగదనే ఆక్రోశంతో గంగారావుకు డబ్బులు సమకూర్చినవారే తహసీల్దార్‌ను హత్య చేయాలనో.. దాడి చేసి బెదిరించాలనో.. ప్రోత్సహించే అవకాశం ఉందంటున్నారు. వీటన్నింటిపైనా పోలీసులు దృష్టిపెడితే ఒక్క రోజులోనే వాస్తవాలు బయటపడతాయని భావిస్తున్నారు.

ఉన్నత స్థాయిలో ఒత్తిడి

రుషికొండలోని తారకరామ లేఅవుట్ ప్రాంతంలోని సుమారు 50 ఎకరాల భూమిని వీఎంఆర్‌డీఏ ఒక సంస్థకు కేటాయించింది. ఆ భూమి పలువురి చేతులు మారి ప్రస్తుతం అధికారపార్టీలోని కీలకనేత బంధువు ఆధీనంలోకి వెళ్లింది. ఆ భూముల్లో నిర్మాణాలు ప్రారంభించిన ఆ కీలకనేత బంధువు నిర్మాణ బాధ్యతలను ప్రస్తుతం గంగారావు పనిచేస్తున్న సంస్థ కు అప్పగించినట్టు సమాచారం. నిర్మాణపనులు జరుగుతుండగానే ఆ భూములు మరోసారి అధికారపార్టీకి చెందిన రాయలసీమ నేత చేతుల్లోకి వెళ్లిపోవడంతో బాధ్యతల నుంచి గంగారావు పనిచేస్తున్న సంస్థను తప్పించారు.తాజాగా తహసీల్దార్ రమణయ్య హత్య నేపథ్యంలో హత్యకు పాల్పడిన గంగారావుతోపాటు తనను కూడా పోలీసులు అరెస్ట్ చేస్తారనే భయంతో గంగారావు పనిచేస్తున్న సంస్థ యజమాని గతంలో అధికారపార్టీకి చెందిన కీలకనేత బంధువును సంప్రదించినట్టు ప్రచారం జరుగుతోంది.ఆ కీలకనేత బంధువు పోలీస్ ఉన్నతాధికారులపై ఒత్తిడి చేయడం వల్లే కేసు దర్యాప్తులో వేగం తగ్గినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసును కొంతకాలంనాన్చిన తర్వాత గంగారావు ఒక్కడే నిందితుడని, హత్య వెనుక మరెవరి ప్రమేయం, ప్రోత్సాహం లేదని పోలీసులు ప్రకటించినాఆశ్చర్యపోనక్కర్లేదని పలువురు రెవెన్యూశాఖ ఉద్యోగులే అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల తీరుపై వారు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సిలబస్ పేరుతో చుక్కలు

... 5వ పేజీ తరువాయి

డీఎస్సీలో పర్‌స్పెక్టివ్ ఎడ్యుకేషన్ ఉంటుంది. ఇందులో నుంచి 20 వరకు బిట్స్ ఇస్తారు. పర్‌స్పెక్టివ్ ఎడ్యుకేషన్‌తోపాటు మిగిలిన సబ్జెక్టులను రిఫర్ చేసేలా తాజాగా డీఎస్సీలో సిలబస్ పెట్టారని, ఇది మరింత ఇబ్బందికరమైన అంశమంటున్నారు. దీనివల్ల మెథడాలజీతోపాటు మిగిలిన సబ్జెక్టులను చదవాలంటున్నారు.

ఏదీ సమయం..?

టెట్ నోటిఫికేషన్‌కు, పరీక్షకు కనీసం మూడు నెలలు, టెట్‌కు, డీఎస్సీకి మధ్య రెండు నెలలు సమయం ఇస్తుం టారు. కానీ తాజాగా టెట్, డీఎస్సీ పరీక్షలకు మధ్య ఉన్న సమయం వారం రోజులు కంటే తక్కువ. సాధారణంగా టెట్ క్వాలిఫై అయిన వారు మాత్రమే డీఎస్సీకి దరఖాస్తు చేస్తారు. కానీ హడావిడి నోటిఫికేషన్‌తో కనీసం పుస్తకాలు తిరగేసేందుకు కూడా అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు. ఈ నెల నుంచి 27 నుంచి మార్చి తొమ్మిది వరకు టెట్ జరగనుంది. మార్చి 14న ఫలితాలు ప్రకటిస్తారు. మార్చి 17 నుంచి 30 వరకు డీఎస్సీ నిర్వహి స్తారు. కాగా టెట్‌కు గతంలో రూ.250 నుంచి రూ.500 వరకు ఫీజు వసూలు చేయగా, తాజాగా దానిని రూ.750కు పెంచారని, డీఎస్సీ ఫీజు గతం లో రూ.వెయ్యి ఉండగా, ఇప్పుడు రూ.1200 చేశారని వాపోతున్నారు.

సత్రం భూములు... అన్యాక్రాంతం!

... 5వ పేజీ తరువాయి

తగ్గడంతో 1923 ప్రాంతంలోనే సత్రం మూతపడిపోయింది. ప్రస్తుతం దాని నామరూపాలు కూడా లేవు. అయితే 1954లో ఈ భూములు భీమిలి బ్లాక్ డెవలప్‌మెంట్ శాఖ అధీనంలోకి తీసుకుని కొంతకాలం పర్యవేక్షణ బాధ్యతలను చూసింది. అనంతరం దేవదాయ ధర్మాదాయ శాఖ ఏర్పాటైన తరువాత 1965లో రికార్డులతో సహా ఆ శాఖకు అప్పగించింది. దీంతో భూములపై పన్నులు కూడా వారే వసూలు చేస్తుండేవారు. కానీ సరైన పర్యవేక్షణ లేకపోవడం, రైతులు, ఇతరుల్లో భూములపై ఆశలు రేకెత్తడంతో క్రమేణా ఆక్రమణలు పెరిగిపోయాయి. అంతేకాకుండా సత్రానికి కేటాయించిన భూములన్నీ ఒకే ప్రాంతంలో లేకపోవడంతో పర్యవేక్షణ బాధ్యతలు కూడా కష్టతరంగా మారాయి. ఇదే అక్రమార్కులకు కలిసివచ్చింది. తమ భూములతో పాటు సత్రం భూములను కలిపేసుకుని, తమ అధీనంలోకి తీసుకునే వెసులుబాటు కలిగింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం భూముల విలువ విపరీతంగా పెరిగిపోవడంతో ఆయా భూములకు వారసులమంటూ కొంతమంది తెరపైకి వచ్చి వీటిలో పక్కా నిర్మాణాలను కూడా చేపట్టారు. మరికొంతమంది షెడ్లు నిర్మించి, అమ్మకాలు కూడా చేపట్టారు.

ఇవీ భూముల వివరాలు

లంగర్‌ఖానా సత్రం నిర్వహణకు వివిధ ప్రాంతాల్లో కేటాయించిన భూములను ప్రస్తుతం సాగుచేస్తున్న వారు అవి తరతరాలుగా తమకు చెందినవేనని నమ్మిస్తున్నారు. ఈ సత్రానికి భీమునిపట్నం మండలం చిల్లపేటలో 65.85 ఎకరాలు, రామజోగి అగ్రహారంలో ఒకచోట 14.61 ఎకరాలు, మరో చోట 7.21 ఎకరాలు, ఇదే గ్రామంలో ఇంకో చోట 1.75 ఎకరాలు కేటాయించారు. అంతేకాకుండా భీమిలిలో 17 ఎకరాలు, కుమ్మరిపాలెంలో రెండు చోట్ల 13.65 ఎకరాల భూములు అప్పగించారు. మిగిలిన భూమి మరిన్ని గ్రామాల పరిధిలో ఉంది.

భూములన్నా ఫలితం సున్నా...

వాస్తవంగా ఇవన్నీ దేవదాయశాఖకు దఖలుపడినవే. వీటిపై ఏటా రూ.లక్షల్లో ఆదాయం రావాల్సి ఉన్నప్పటికీ రూ.వేలల్లో కూడా రావడం లేదు. అంతేకాకుండా భూముల పరిరక్షణకు అధికారులు చేస్తున్న ఖర్చు ఆదాయం కన్నా అనేక రెట్లు ఎక్కువగా ఉందని సమాచారం. ఇంకా అనేక భూములకు సంబంధించిన కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. సత్రానికి చెందిన భూముల వద్ద అనేక ప్రాంతాలలో దేవదాయశాఖ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసింది. హద్దులను నిర్ణయిస్తూ సిమెంటు దిమ్మలను కూడా నిర్మించింది. అయితే వీటిని తొలగించి మరీ అక్రమార్కులు ఆక్రమణలకు తెగబడ్డారు.

పెండింగ్‌లో కేసులు

సత్రం భూములను సాగుచేస్తున్న వారిలో కొంతమంది కోర్టుల్లో కేసులు వేశారు. ఇలా సుమారు 23 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 41 కేసులు ట్రిబ్యునల్‌లో ఉండిపోయాయి. ఈ కేసులు తేలితే తప్ప సత్రం భూముల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. వీటిని త్వరగా తేల్చేందుకు వీలుగా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా ఎలాంటి కేసులు లేని భూములపై ప్రస్తుతం కొంత మంది కన్ను పడింది. లే అవుట్లుగా మార్చి సొమ్ముచేసుకునేందుకు రియల్ వ్యాపారులు కూడా రంగంలోకి దిగినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ భూముల వ్యవహారాన్ని సంగివలస పోలమ్మవారి దేవాలయం ఈవో చూస్తున్నారు.

భూముల రక్షణకు చర్యలు

లంగర్‌ఖానా సత్రం పేరుతో ఉన్న విలువైన భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. కోర్టు కేసుల్లో ఉన్న భూములకు సంబంధించి శాఖ తరఫున పోరాడుతున్నాం. స్టే వెకేషన్ పిటిషన్లు వేశాం. కోర్టు ఉత్తర్వులు వెలువడిన వెంటనే వాటిని అధీనంలోకి తీసుకుంటాం. మిగిలిన భూముల్లో ఆక్రమణల జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- బండారు ప్రసాద్, ఈవో, లంగర్‌ఖానా సత్రం



అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, ఫిబ్రవరి 11 : వరాహలక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠంపజేసి ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠించి ప్రతి నామానికి ఒక్కొక్క బంగారు సంపెంగతో అర్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు.

కిటకిటలాడిన జూపార్కు

ఆరిలోవ, ఫిబ్రవరి 11 : నగరంలోని జూపార్కు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. సుమారు 2844 మంది పర్యాటకులు జూను సందర్శించారు. వారి ద్వారా రూ. 3.20 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.

ప్రశాంతంగా హిందీ పరీక్షలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 11 : పట్టణంలోని జీవీఎంసీ పండిట్ నెహ్రూ ఉన్నత పాఠశాలలో చెన్నైకు చెందిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో పరిచయ్, ప్రాథమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారధ, ప్రవీణ పరీక్షలను ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షలకు 83 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్కూల్ హెచ్ఎం తిరుమల శ్రీదేవి పరీక్షలను పర్యవేక్షించారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 11 : విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమని జనసేన నగర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం శ్రీ శివశంకర్ విద్యా మందిర్ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. అనంతరం విద్యా సంస్థల నిర్వాహకులు వంశీకృష్ణను సన్మానించారు.

గంగాధారలో మాఘమాస స్నానాలు

సింహాచలం, ఫిబ్రవరి 11 : సింహగిరిపై ఉన్న గంగాధార, కొండదిగువ వరాహ పుష్కరిణిలో భక్తులు ఆదివారం మాఘ మాసం సందర్భంగా పవిత్ర స్నానాలు ఆచరించారు. వేకువజాము నుంచే కొందరు పుష్కరిణికి, మరికొందరు గంగధార వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం వరకూ స్నానాలు ఆచరించారు. అనంతరం సమీపంలోని శివునికి పూజలు చేసి బ్రాహ్మణులకు తాంబూలాలు ఇచ్చారు. తరువాత సింహాద్రినాథుడ్ని దర్శించుకున్నారు.

సూర్య భగవానుడికి పూజలు



సింహాచలం, ఫిబ్రవరి 11 : కృష్ణాపురం నృసింహవనంలో కొలువుదీరిన సూర్యనారాయణుని దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. మాఘ మాసంలో తొలి ఆదివారం కావడంతో నగరం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు జరిపారు. కొందరు ఆదిత్య హృదయం పారాయణం చేసి సూర్య నమస్కారాలు చేశారు.

సినిమా గైడ్

- **ట్రూ లవర్ :** శ్రీకన్య, వెంకటేశ్వర, గోకుల్, , శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **లాల్ సలామ్ :** మెలోడి, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **యాత్ర-2 :** సంగం, కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), శ్రీన్య (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** శారద, లక్ష్మీకాంత్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** రమాదేవి, లీలామహల్, లక్ష్మీకాంత్ (గాజువాక)
- నా సామిరంగ : శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 18,టమాటా 24, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 40, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 24, క్యారేట్ 22, దొండకాయలు 34, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబటి 26, ముల్లంగి 14, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 36, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 32 , కంద 54, దేముడు చిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 117
ఫారం ధర	-- 137
విత్ స్కిన్	-- 244
స్కిన్‌లెస్	-- 254

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8 లో..



అసోసియేషన్ ఆధ్వర్యంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దుకాణాలు



ఆవరణలో పేరుకుపోయిన తుప్పలు

కలగానే రైతు బజారు ఏర్పాటు?

- విశాలాక్షినగర్‌లో దశాబ్దాలుగా స్థానికుల ఎదురుచూపు
- ఎన్నికల సమయంలోనే గుర్తు
- ఆ తరువాత పట్టని పాలకులు
- తాత్కాలికంగా విశాలాక్షినగర్ సంక్షేమ సంఘం పేరుతో దుకాణాల ఏర్పాటు
- కనీస సదుపాయాలు కరువు

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 11 : జీవీఎంసీ 9 వార్డు పరిధిలోని విశాలాక్షినగర్‌లో రైతుబజార్ ఏర్పాటు కలగానే మిగిలింది. వార్డులో సుమారు ఇరవై వేల మంది జనాభా నివసిస్తున్నారు. స్థానికంగా రైతుబజారు లేకపోవడంతో వారంతా ఇతర ప్రాంతాలకు వెళ్లి కూరగాయలు,ఇతర సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం రైతు బజారు ఏర్పాటు చేయకపోవడంతో విశాలాక్షి నగర్ సంక్షేమ సంఘం రైతు బజారు మాదిరిగా బీవీకే స్కూల్ ఎదురుగా షాపులు ఏర్పాటు చేసింది. కొంత కాలం వరకు రైతులు ఇక్కడికి వచ్చి కూరగాయల అమ్మకాలు జరిపేవారు. కనీస సదుపాయాలు లేకపోవడంతో కొంతకాలం తరువాత అమ్మకాలు ఆపేశారు. దీంతో ఇక్కడ స్థానిక వ్యాపారులు కూరగాయల అమ్మకాలు చేసేవారు. కొంతమంది దుకాణదారులు రహదారులపై కూరగాయలు విక్రయిస్తుండడంతో అసోసియేషన్ ఏర్పాటు చేసిన దుకాణాల్లో ఎవరూ కొనుగోలు చేసేవారు కాదు. దీంతో అసోసియేషన్ ఏర్పాటు చేసిన దుకాణాలు కూడా ప్రస్తుతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి అసోసియేషన్ ఏర్పాటు చేసిన దుకాణాల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో వ్యాపారులు అమ్మకాలు చేయడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం దుకాణాల సముదాయంలో మొక్కలు పెరిగిపోవడంతో షాపులను పనికిరాని వస్తువులతో నింపివేశారు.

ప్రజల ఇబ్బందులను గమనించాలి



విశాలాక్షినగర్ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన దుకాణాల ప్రాంగణాన్ని మౌలిక సదుపాయాలతో ఆధునికీకరించి రైతుబజారు ఏర్పాటు చేయాలి. మార్కెటింగ్ శాఖాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటే రైతులు వచ్చి అమ్మకాలు జరుపుతారు.

- భీమారావు, స్థానికుడు

అరాచక పాలనకు ఓటుతో బుద్ధి చెబుదాం

తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, ఫిబ్రవరి 11 : వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలంటే అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పిలుపునిచ్చారు.ఆదివారం పెదగదిలిలో జరిగిన ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు టీడీపీ, జనసేన ఓట్లు తొలగించే పనిలో ఉన్నారని, ప్రతిఒక్కరూ జాబితాలో పేరు ఉన్నదీ లేనిదీ సరిచూసుకోవాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పంచ గ్రామాల భూసమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవింద్,గాడి సత్యం, ఒమ్మి పోలారావు. బాదరు బాలరాజు పాల్గొన్నారు.



ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి

9వ వార్డులో ఓటరు నమోదు

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 11 : జీవీఎంసీ 9వ వార్డు పరిధిలోని విశాలాక్షినగర్ కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రాంతంలో టీడీపీ నాయకుడు వేజెళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో ఓటరు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా అర్హులై ఉండి జాబితాల్లో పేర్లు లేనివారితో కొత్తగా దరఖాస్తు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, నాయకులు వెంపాడ శ్రీనివాసరెడ్డి, అన్నె రాజా, గొలగాని వెంకన్న, ఈగల కొండలరావు, గరికిన నూకరాజు, బోర సాయి, గరికిన శ్రీను, దాగూరు పాల్గొన్నారు.

ఓటరు నమోదు తప్పనిసరి

వెంకోజీపాలెం : అర్హులైన వారు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ అన్నారు. హెచ్‌బీకాలనీ జంక్షన్‌లో టీడీపీ నాయకులు ఓటరు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు లేని వారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి మళ్ల రవికుమార్, సీహెచ్ గోవింద్, బోను శ్రీను,నరేంద్ర, సోని, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, గౌరి పాల్గొన్నారు.16వ వార్డు ఇసుకతోట ప్రాంతంలోనూ ఓటరు నమోదు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నారు గోపి, ముగడ వాసు, తూర్పు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, జి. అప్పన్న, శంకర్, పాల్గొన్నారు.

'తూర్పు సీటు యాదవులకు కేటాయించాలి'

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 11 : వైసీపీ అధిష్ఠానం తూర్పు నియోజకవర్గం స్థానాన్ని యాదవ సామాజికవర్గానికి కేటాయించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు వీఎంఆర్‌డీఏ మాజీ చైర్మన్ అక్కరమాని నిర్మల భర్త, వైసీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు ఆధ్వర్యంలో ఎంవీపీలోని కార్యాలయంలో నియోజకవర్గంలోని యాదవ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యాదవులంతా ఒకే తాటిపైకి రావాలని, అప్పుడు మాత్రమే తగిన ప్రాధాన్యత లభిస్తుందని చెప్పారు.

సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఫిబ్రవరి 11 : పీఎంపాలెం క్రికెట్ స్టేడియంలో ఈనెల 13న జరిగే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి వస్తున్న ముఖ్యమంత్రి జగన్ పర్యటనను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.ఆదివారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వైసీపీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సీఎం కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. సమావేశంలో వైసీపీ యువజన విభాగం కో-ఆర్డినేటర్ ముత్తంశెట్టి సందీష్, శ్రావణ్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, కార్పొరేటర్లు దౌలపల్లి ఏడుకొండలరావు, లొడగల అప్పారావు, ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా శ్రమ జీవుల కాలనీ రోడ్డు



రోడ్డుపై మురుగు నీటి ప్రవాహం

ఆనందపురం,ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని శ్రమజీవుల కాలనీ, బాలికల వసతి గృహానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. అధికారులు ఈ రోడ్డు మరమ్మతుకు రూ. 8 లక్షలు మంజూరు చేశారు. గ్రావెల్ వేసి పనులను నిలిపి వేయడంతో నిధులు నిరుపయోగమయ్యాయి. మరోవైపు రోడ్డుకి ఇరువైపులా కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లోని వాడుక నీరంతా రోడ్డు మీదకు వచ్చేస్తోంది. 20 ఏళ్ల కిందట ఈ రోడ్డు నిర్మించారు. నాటి నుంచి మరమ్మతులు లేవు. స్థానికులు ఈ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లడంతో రూ. 8 లక్షలు మంజూరు చేసి గ్రావెల్ వేశారు. దానిపై సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా,ఇప్పటివరకు పనులు చేపట్టలేదు. దీంతో రహదారి అధ్వానంగా మారుతోంది.

దీనదయాళ్ ఉపాధ్యాయకు నివాళి

పెదవాల్తేరు, ఫిబ్రవరి 11 : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, బీజేపీ హైందవ సిద్ధాంత కర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సభ ఆదివారం పెదవాల్తేరులోని బీజేపీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

75 మంది రక్తదానం

భీమునిపట్నం, ఫిబ్రవరి 11 : చిన్నబజారు డచ్ రోడ్డులో వున్న కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ కార్యాలయం ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని విశాఖ హార్బర్ ఎస్ఐ జి. శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ సంస్థ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ కలిగొట్ల శ్రీదేవి జయంతి పురస్కరించుకుని ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 75 మంది దాతల నుంచి విశాఖ బ్లడ్ సెంటర్ కన్వీనరు రవిశంకర్, సిబ్బంది రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కలిగొట్ల శ్రీరామ్, కెఎస్ఎన్ మూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం, ఫిబ్రవరి 11 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి ఇద్దరు దాతలు వేర్వేరుగా రూ. లక్ష చొప్పున విరాళం సమర్పించారు. ప్రహ్లాదపురం ప్రాంతానికి చెందిన పిళ్లా భాస్కరరావు, కమల దంపతులు రూ.1,00,116లను నగదు రూపంలో, మర్రిపాలెం ప్రాంతానికి చెందిన ఎం.సీతాపతిరావు దంపతులు రూ.1,11,111లను చెక్కు రూపంలో అన్నప్రసాద విభాగం ఏఈఓ పాలూరి నరసింగరావుకు ఆదివారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాతలకు అంతరాలయంలో దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : కోరాడ



సమావేశంలో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు

ఆనందపురం, ఫిబ్రవరి 11 : టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు అన్నారు. ఆదివారం ఆయన బోని పంచాయతీలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రతిఒక్కరూ తిరుగుబాటు చేయాలన్నారు. అనంతరం ఆయన ఈనెల 17న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శంఖారావం సభ నిర్వహణకు వేములవలసలోని పలు స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంట్రెడ్డి రమేష్, మీసాల సత్యన్నారాయణ, బొద్దపు శ్రీను, సురాల సత్యవర ప్రసాదరావు, అప్పారావు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న పురస్కారం ఎట్ల హర్షం

భీమునిపట్నం, ఫిబ్రవరి 11 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్రం భారతరత్న పురస్కారం ప్రకటించడం తెలుగు వారికి దక్కిన గొప్ప గౌరవమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. ఆదివారం బీచ్‌రోడ్డులోని జీఎస్ఆర్ భవన్‌లో ఆదర్శ హిందీ ప్రేమి మండలి ఆధ్వర్యంలో పలువురు పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ప్రధానిగా పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమి మండలి సంస్థ అధ్యక్షుడు కృష్ణారావు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నాగుపాము కలకలం

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 11 : తెన్నేటి పార్కు సమీపంలో నాగపాము ఆదివారం కలకలం సృష్టించింది. దీంతో పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. పార్కు సమీపంలోని బీచ్ రోడ్డులో ఉన్న గ్రానైట్ గోడ కింద ఉన్న పాము కదలికను సందర్శకులు చూశారు. వెంటనే వారు స్నేక్ క్యాచర్‌కి సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి రాళ్ల కింద ఉన్న పామును పట్టుకుని కొండ ప్రాంతంలో విడిచిపెట్టారు.

పద్మనాభంలో సుపథ పరీక్షలు

పద్మనాభం, ఫిబ్రవరి 11 : విద్యార్థులకు మాతృ భాష ప్రాధాన్యతతో పాటు దేశ సంస్కృతీ, సంప్రదాయాలను తెలియజేయాలన్న ఉద్దేశంతో సుపథ ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నామని సుపథ సంస్థ వ్యవస్థాపకుడు యూవీఏఎస్ రాజు చెప్పారు. పద్మనాభంలోని గోస్తనీ విద్యాపీఠ్ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం 17 పాఠశాలల విద్యార్థులకు సుపథ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలో 20 ఏళ్లుగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. రామాయణం, భారతం,భాగవతం వంటి గ్రంథాల సారాంశాన్ని తెలుసుకోవడం వల్ల పిల్లల్లో విలువలు పెంపొందుతాయన్నారు. కాగా పరీక్షలకు 17 పాఠశాలల నుంచి 452 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, అసిస్టెంటు లేబర్ కమిషనర్ గాడు ఎల్లాజీరావు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, నాయకులు, ఎర్నాయుడు, సత్యనారాయణ, పద్దు, నర్సింహనాయుడు, ఉపాధ్యాయులు సూరిబాబు, శ్రీను, ఎర్రయ్య, చిన్నారావు, శ్రీనివాసరావు, రాణి, శ్రీహరి, శర్మ, ఎర్రయ్య శ్రీను పాల్గొన్నారు.



బాలికకు బహుమతి అందిస్తున్న యూవీఏఎస్ రాజు



కొత్తగా నిర్మించిన పగోడాలు

శిల్పారామంలో అదనపు హంగులు

మధురవాడ, ఫిబ్రవరి 11 : మధురవాడ శిల్పారామానికి నిర్వాహకులు కొత్త హంగులు సమకూర్చారు. శిల్పారామంలోని నాలుగు ప్రాంతాల్లో పర్యాటకులు సేదతీరడానికి, ఫొటో పాయింట్‌కు వివిధ ఆకారాల్లో పగోడాలు నిర్మించారు. వీటిలో వాటర్ స్పోర్ట్సు సమీపంలో నిర్మించిన పగోడాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు మరో మూడు ప్రాంతాల్లో దీర్ఘచతురస్రం, చతురస్రం ఆకారాల్లో పగోడాలు నిర్మించారు. వీటి చుట్టూ ఉన్న పచ్చదనం పర్యాటకులకు కనువిందు చేస్తోంది.

అభయ ప్రధాత ఆంజనేయస్వామి

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 11 : జగదానంద కారకుడు శ్రీరామచంద్ర ప్రభువైతే.. ఆయనకే ఆనందాన్ని అందించినవాడు అభయ ప్రధాత ఆంజనేయ స్వామి అని సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు ఏటీసీ పార్కు ఆవరణలో ఆదివారం కూడా షణ్ముఖశర్మ ప్రవచనాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ తాను బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించినా హనుమను ఏమీ చేయలేదని గ్రహించిన ఇంద్రజిత్తు హనుమను మించిన యోధుడు, బలవంతుడు ఈ ముల్లోకాల్లో లేడని గ్రహించాడన్నారు. అనంతరం ఆకొండి వెంకటరావు బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహ్లాదం పంచింది. జ్యోతిష్య నిపుణుడు కందాళ వెంకట సత్యశ్యామ్, అరుణా గాయత్రీ దంపతుల నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

భక్తి శ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినం

భీమునిపట్నం, ఫిబ్రవరి 11 : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీ మాత ఆత్మార్పణ దినం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకుడు వెలవలపల్లి సత్యసాయి శంకర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం హోమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన జరిపారు. సాయంత్రం 1001 దీపాలతో ఆరాధించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం సంఘం అధ్యక్షుడు బొండా నరసింహమూర్తి, గౌరవాధ్యక్షుడు పోలిశెట్టి వెంకటరమణ, ఉసిరికల సతీష్, బంగార్రాజు, గుగ్గిళ్ళ బాబి, కట్టమూరి వెంకన్నబాబు, కొత్త రామకృష్ణ పాల్గొన్నారు.

15వ వార్డులో ఎంపీ ఎంవీవీ పాదయాత్ర



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ సత్యనారాయణ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 11 : జీవీఎంసీ 15 వార్డు కొత్త వెంకోజీపాలెం కొండవాలు ప్రాంతంలో వైసీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆదివారం పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే కొండవాలు ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం పరిశీలకుడు మొల్లి అప్పారావు, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గవర కార్పొరేషన్ డైరెక్టర్ పీలా జోషిలా, 15వ వార్డు అధ్యక్షుడు పీల వెంకట పరదేశినాయుడు, అప్పారి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



భీమునిపట్నం, ఫిబ్రవరి 11 : పట్టణంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం దిగువనున్న ఎన్టీఆర్ కాలనీలోని లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఆలయ నిర్వాహకులు పీత అప్పారావు, అల్లిపిల్లి వేణుబాబు ఆధ్వర్యంలో ఉదయం ఆరున్నర నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. సింహాచలం వేద పండితులు బొప్పిలి మణికంఠశర్మ, అర్చకులు శంకర శర్మ ఆధ్వర్యంలో సాయంత్రం లక్ష్మీగణపతి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు.

91 మందికి కళ్లద్దాలు పంపిణీ

ఆరిలోవ, ఫిబ్రవరి 11 : పెదగదిలి జంక్షన్‌లో ఇటీవల జరిగిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో ఎంపిక చేసిన రోగులకు తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదివారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. నాటి శిబిరంలో వైద్యులు 91 మందికి దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించారు. వారికి గీతం కళాశాల సమకూర్చిన కళ్లద్దాలను ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, నాయకులు బుడుమూరు గోవింద్. ఒమ్మి పోలారావు, గాడి సత్యం, బాదరు బాలరాజు, గణపతి, విజయ. తేజ. ఫణీంద్ర, దామోదర్ పాల్గొన్నారు.

పాండ్రంగిలో 'పల్లెకు పోదాం'



మహిళకు కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రం అందిస్తున్న నాయకులు

పద్మనాభం/పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 11 : మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు ఆదివారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాండ్రంగిలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, సీనియర్ నాయకుడు పొన్నగంటి అప్పారావు గ్రామంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కృష్ణాపురంలో బీజేపీ నాయకుడు వెంగమాంబ శ్రీనివాసరావు, పొట్నూరులో దామోదర యాదవ్, శేరిఖండంలో పి. అప్పారావు, అయినాడతో సీతాలక్ష్మి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి రామానాయుడు, మెడికల్ సెల్ ఏపీ విభాగం కన్వీనర్ రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులు కృష్ణారావు, అప్పలరమణ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై పలకలు లేక ప్రమాదాలు



కారుషెడ్ వద్ద ఫుట్‌పాత్‌పై దుస్థితి

మధురవాడ,ఫిబ్రవరి 11 : జీవీఎంసీ ఏడో వార్డులోని పలుచోట్ల ఫుట్‌పాత్‌లపై వేసిన సిమెంటు పలకలు కాలువలో పడిపోవడంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు.కారుషెడ్ కూడలి, చంద్రంపాలెం, మధురవాడ సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల సిమెంటు పలకలులోనికి కుంగిపోగా మరికొన్ని చోట్ల పలకల మధ్య ఖాళీలు ఏర్పడ్డాయి.దీంతో వాటిపై నడచివెళ్లే వారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై పలకలను సరిచేయాలని పలువురు కోరుతున్నారు.